కంబళి కప్పిన శవం

సికిందర్

మిస్. సుజాతను చూసి లాల్ అసహనంగా నిట్టూర్చి, తీవ్రస్వరంతో అన్నాడు: "మీరు వచ్చి నాలుగు నిమిషాలవుతోంది. ఇంతవరకూ పేరు మాత్రమే చెప్పారు. ఇంకేమీ చెప్పదలచలేదా? నా పార్ట్నర్ ఇది బ్యూటీ కాంటెస్టు అనుకుంటున్నాడు!"

లాల్ మాటలు విని జాన్ ఛటుక్కున నాలిక కరచుకొని, సుజాత మీదనుంచి చూపులు తప్పించి సీలింగ్ కేసి చూడసాగాడు.

సుజాత చిన్నగా నవ్వుతూ అంది, "బ్యూటీ కంటెస్ట్, టీజింగ్స్....అవన్నీ కాలేజీ లైఫ్తోటే అంతమయ్యాయి. నేనిప్పుడు బాధ్యతగల వ్యక్తిని!"

"కానీ....మీరింకా కుమారి...." లాల్ నసిగాడు.

సుజాత మళ్ళీ నవ్వింది. "మీ అనుమానం అరమైంది. కుమారి అయినంత మాత్రాన బాధ్యతలుండవా? నా బాధ్యత సంసారపరమైనది కాదు. వ్యాపారపరమైనది.

అంతేకాదు—నా తండ్రి ఆరోగ్యాన్నీ, చెల్లెలి భవిష్యత్తును కూడా పరిరక్షించే బాధ్యత నాది."

లాల్ ఆసక్తిగా ముందుకు వంగాడు, "మీ కుటుంబ సభ్యులెవరు?"

"నా తండ్రి—నేను—నా చెల్లెలు" చెప్పింది సుజాత, "నా తండ్రికి సంవత్సరం నుంచి గుండెజబ్బు వుంది.... రెండుసార్లు స్ట్రోక్ కూడా వచ్చింది. ఇప్పటి పరిస్థితినిబట్టి యెలాటి ఉద్రేకాలకి గురయినా ప్రాణాపాయం వుంటుందని మా డాక్టర్ అన్నాడు."

"ఐ యాం వెరీసారీ. మీ రిక్కడికి వచ్చారంటే...."

సుజాత అందుకుంది. "మిస్టర్ లాల్ సమస్య ఏమిటో చెప్పేముందు మా కుటుంబం గురించి చెప్పాలి. ఇది పరిస్థితని స్పష్టంగా అర్థంచేసుకోవడానికి మీకు చాలా ముఖ్యం."

లాల్ తలూపాడు.

సుజాత ఒక్కక్షణం ఆగి ప్రారంభించింది: "సంవత్సరం నుంచీ మా నాన్న ఆరోగ్యం బాగాలేదు. సంవత్సరం క్రితంవరకూ ఆయన ఎన్నో వ్యాపారాలు చేశారు. తీరిక, విశ్రాంతి వుండేవికావు. అయినా ఆయన లెక్కచెయ్యలేదు. అదే ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీసింది.... గుండెజబ్బు ప్రారంభమైంది.

"అప్పటికీ ఆయన డాక్టర సలహా లెక్కచెయ్యలేదు! పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్ చెప్పాడు. మరి వ్యాపారం చూసేదెవరు? దగ్గరి బంధువులెవరూ లేరు—వున్నా ఆయన నమ్మరు. చివరికి ఆయన కయిష్టమైనా, నా చదువు పూర్తికావడంతో ఆ బాధ్యత నేనే తీసుకొన్నాను.

"ఈ సంవత్సరం నుంచీ వ్యాపారమంతా నేనే చూస్తున్నాను. నాన్న ఇల్లు కదలకుండా విశ్రాంతి తీసుకొంటున్నారు—నా చెల్లెలు ఆయనకు సపర్యలు చేస్తోంది. ఆమెకు తండ్రిపట్ల ప్రేమ ఎక్కువ. రోజల్లా ఆయన్నే అంటిపెట్టుకొని వుంటుంది. ఈ సంవత్సరం నుంచీ ఆమెకు ఇల్లు తప్ప బయటి ప్రపంచం తెలీదు! నాన్న జబ్బుపడడంతో బియ్యే సగంలో మానేసి నాట్యం నేర్చుకుంది. ఈ మధ్య డ్రైవింగ్ కూడా నేర్చుకుంటోంది."

"ఒక్క సంవత్సరంలో మీ జీవితాలు చాలా మారిపోయాయి కదూ?"

"అవును. ఇంతకాలం ఎలాటి అవాంతరం లేకుండా గడిచిపోయింది. నా తండ్రి ఇంకెంతో కాలం బ్రతకరని తెలిసినా; బ్రతికినంతకాలం సుఖంగా ఎలాంటి సమస్యలూ భయాలూ లేకుండా, ఉద్రేకాలకి లోనుకాకుండా వుండాలని ప్రతి చిన్నవిషయంలోనూ ఎంతో జాగ్రత్త వహిస్తూ వచ్చాను.... కానీ, ఇప్పుడు నాకు అగ్నిపరీక్ష యెదురయింది."

"ఏమిటది?"

"ఇందాక నాకో ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్లో మాట్లాడిన మనిషి నన్ను—మా కుటుంబాన్ని బెదిరిస్తున్నాడు!"

"ఏ విషయంలో?"

"నేను నమ్మలేని విషయంలో! నా చెల్లెలి ప్రేమలేఖలు తనవద్ద వున్నాయని చెప్పాడు!"

"ఐసీ. అతని మాటలు మీరు నమ్మలేదా?"

"నమ్మను—ఉష అలాంటి పన్లు చెయ్యదు! ఆమెకు జీవితంపట్ల, వివాహంపట్ల నిర్దిష్టమైన అభిప్రాయా

లున్నాయి. ప్రేమవివాహాల్లో విశ్వాసం లేదు."

"ఈ మాటలు మీకు చెప్పిందా?"

"ఇలాటి విషయాలు ఆమె మాట్లాడదు! మీకు ముందే చెప్పాను—ఆమె ఇల్లు కదలదు! ఆమెకు ఇల్లే ప్రపంచం, తండ్రియే సర్వస్వం. పైగా బిడియమెక్కువ. పరాయి మనుషుల దగ్గర — మగవాళ్ళు కానీండి, ఆడవాళ్ళు కానీండి—తలెత్తి చూడదు. ఈ ఏడాదినుంచి ఆమెకు బయటి పరిచయాలు లేవు—స్నేహితులు కూడా యెవరూ లేరు. మీరొకసారి ఆమెని చూస్తే స్వభావం అర్థం చేసుకొంటారు. బయటిప్రపంచంతో సంబంధాలు లేని మనిషి ప్రేమలేఖలు వ్రాస్తోందంటే మీరు నమ్ముతారా?"

"ఆమె కారు డ్రైవింగ్ నేర్చుకుంటుందన్నారు— ఎవరు నేర్పుతున్నారు?"

"ప్రతీ ఆదివారం—నేను."

"ఆమెకి కందులో ఆసక్తి ఎందుకు కల్గింది?"

"ఆమె వ్యాపకాలలాటివి. చదువుకొనే రోజుల్లో స్టాంపులు సేకరించేది. చదువు మానేశాక నాట్యం నేర్చుకుంది. ఇప్పుడు కారుపిచ్చి పట్టింది—ప్రత్యేకంగా కారణమంటూ ఏమీలేదు."

"సరే, ఇక అసలు విషయానికి వద్దాం. మిమ్మల్ని బెదిరించిన మనిషి పేరేమిటో తెలుసా?" అడిగాడు లాల్.

"తెలుసు" అంది సుజాత బ్యాగులోంచి ఒక చిన్న కాయితం తీస్తూ. లాల్ దాన్ని అందుకొని చూశాడు: పేరు, ఫోన్ నెంబర్ అడ్రసు వున్నాయి.

"అతని పేరు దివాకర్" సుజాత మళ్ళీ అంది, "అతనికి తెలుగు రాదనుకొంటాను, హిందీలోనే

మాట్లాడాడు."

"మిమ్మల్ని ఏమని బెదిరించాడు?"

"ఉష వ్రాసిన ప్రేమలేఖలు ఒకానొక చోటనుంచి తనకు లభించాయట. అవి చాలా అసభ్యకరంగా ఆమె పరువునూ తద్వారా కుటుంబ ప్రతిష్టనూ నాశనం చేసే విలా వున్నాయట. వాటికి తగిన ధర చెల్లించి నేను స్వాధీనం చేసుకోకపోతే ఏర్పడే దుష్పరిణామాలకి నేనే బాధ్యురాల్నవుతానట!"

"ఎలాటి దుష్పరిణామాలు....?"

"నేను డబ్బివ్వకపోతే వాటిని నాన్నకు చూపిస్తాడట. ఇక మీరే వూహించండి! ఆ ఉత్తరాలు చదివి నాన్న—"

"అయితే మీరు డబ్బు చెల్లించాలనుకొంటున్నారా?"

"అవును."

"మరి యిక్కడికెందుకొచ్చారు?"

"ఆ ఉత్తరాలకి ఎంత ధరయినా చెల్లిస్తాను. కాని, బ్లాక్ మెయిలర్స్‌ని యెప్పుడూ నమ్మకూడదు! అలాటి ఉత్తరాలెన్ని వున్నాయో నాకెలా తెలుసు!"

"అవును, ఎవరికీ తెలియదు, అతనికి తప్ప."

"అంతేకాదు—వాటికి డూప్లికేట్స్ కూడా వుంటే- మళ్ళీ మళ్ళీ బెదిరిస్తాడు. జలగలా పీడిస్తాడు. మిస్టర్ లాల్, అతడి పీడ ఈ ఒక్క ప్రయత్నంలోనే తొలగిపోవాలి! అతని దగ్గర యెన్ని ఉత్తరాలున్నాయో, వాటికి డూప్లికేట్స్ యెన్ని వున్నాయో మీరు తెలుసుకుంటే—"

"ఆ విషయం మీ రతన్ని అడగలేదా?"

"అడిగితే చెప్పలేదు. ఒంటి గంటకు తనింటికొస్తే

విషయాలన్నీ మాట్లాడుకోవచ్చనాన్నడు. నేను వెళ్ళదల్చుకున్నాను. కానీ మీ సహాయం లేనిదే ఈ గండాన్ని తప్పించలేను!"

"ఆ ఉత్తరాలు మీ చెల్లెలు వ్రాయనప్పుడు యెందుకింత భయపడుతున్నారు? ఆమె దస్తూరీని ఫోర్జ్ చేసే అవకాశం యెవరికి వుంటుంది?" లాల్ అడిగాడు.

"అదే అర్థంగావడం లేదు. ఆ ఉత్తరాలు సుమ్మాటికీ ఉష వ్రాయలేదు! ఈ నిజం నాకు తెలుసు, ఆమెకూ తెలుసు. మరి నాన్నకు? ఆయన వాటిని నమ్మి ఉషను ఇంటినుంచి బహిష్కరిస్తే? ఆమె విశ్వాసఘాతానికి ఆయన ఉద్రేకానికి లోనై గుండెపోటు వచ్చి—ఓహ్, ఇక చెప్పకండి!"

"సరే, ఆ ఉత్తరాల్ని స్వాధీనం చేసుకోడానికి మేం మీకు తోడ్పడతాం. కానీ చూస్తూ చూస్తూ ఒక బ్లాక్ మెయిలర్ ని వదిలేయమంటారా?"

"అవును! ఇందులో మీరేమీ చట్టవ్యతిరేక చర్యకు పూనుకోవడంలేదు. చట్టం గురించి నాకూ తెలుసు. మా కుటుంబ ప్రతిష్టకూ, ఐక్యతకూ ప్రమాదం వాటిల్లే ఈ వ్యవహారంలో మీరు అనుమతి లేకుండా నా ప్రత్యర్థికి రవంత హాని కూడా తలపెట్టలేరు! ఇది పోలీసులకన్నా డా వరిసుంది. నేను పోలీసు సహాయమే కోరేదాన్ని— కాని రహస్యాలకు భద్రత వుండదు. అందుకే మీ దగ్గర కొచ్చాను. మీ కిష్టం లేకపోతే విషయాలన్నీ ఇక్కడితో మర్చిపోండి!"

ఛటుక్కున లేచి నిలబడింది సుజాత.

జాన్ గాభరాగా లాల్ ని చూశాడు.

లాల్ ఒక్కక్షణం తర్వాత అన్నాడు, "ఇందులో

మా మధ్యవర్తిత్వం దివాకర్ అంగీకరిస్తాడా?"

"చచ్చినట్టు! మీరు ఫోన్ చెయ్యండి!"

లాల్ రిసీవరెత్తి ఒక నెంబర్ డయల్ చేశాడు. వెంటనే అవతల రెస్పాన్స్ రావడంతో హిందీలో అన్నాడు.

"మిస్టర్ దివాకర్, డిసీజ్ లాల్ స్పీకింగ్. యస్, TCDA పార్ట్నర్ని. నేను మిమ్మల్ని చూడాలి.... ఎందుకా? మీరు బ్లాక్ మెయిల్ చేస్తున్న సుజాత మమ్మల్ని కలుసుకుంది గనుక! నో, నో! గాభరాపడవద్దు! దటీజ్ రైట్....ఈ వ్యవహారంలో పోలీసులకు ప్రవేశం లేదు. టాప్ సీక్రెట్! ఓ.కే. నేనా ఉత్తరాలు చూడాలి. కాదు, పూర్తి ఉత్తరం—ప్రతి అక్షరం చదవాలి. గుడ్-వై నాట్? తప్పకుండా వస్తాను. ఆ ఉత్తరాలు చూపించనిదే నయాపైసా కూడా ముట్టదు! అవి దొంగ వుత్తరాలు కాదని నాకు నమ్మకం కుదరాలి. అప్పుడుగానీ డబ్బు చెల్లించబడదు....గో టు హెల్! మీ రిప్పుడు డిటెక్టివ్తో వ్యవహరిస్తున్నట్లు గమనించండి! అవును.... అవును....మా క్లయింట్స్ గాడిదను కొనాలని చెప్పినా సరే, మేం దాన్ని పరీక్షించి మేలైనదేనని నిర్ణయించవల్సిందే! అలాగే, థాంక్స్, పెట్టేస్తున్నాను."

లాల్ రిసీవర్ పెట్టేసి అదోలా నవ్వాడు.

"ఏమన్నాడు" జాన్ అడిగాడు.

"ఉత్తరాలు చూపిస్తానన్నాడు. ఇప్పుడు నేనూ, సుజాత వెళతాం" అని సుజాతవైపు తిరిగి మళ్ళీ అన్నాడు లాల్, "మీ చెల్లెలి చేతివ్రాత చూడాలి. చదువుకొనే రోజుల్లో ఆమె నోట్స్గానీ, ఉత్తరాలుగానీ వుందా."

"ఆమె గేయాలు వ్రాస్తుంది" అంది సుజాత,

"ఇప్పటికీ! కానీ పత్రికలకి పంపదు. ఇన్ ఫీరియారిటీ కాంప్లెక్స్. మీ రామె దస్తూరీ చూడాలనుకుంటే ఆమె నోట్ బుక్ లో ఒక గేయం చింపి తెస్తాను."

"అది చాలా మంచిపని" అన్నాడు జాన్ సొరుగు లోంచి ఆంధ్రసచిత్ర వారపత్రిక తీస్తూ.

2

సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంటకి లాల్, సుజాత కారులో శాంతినగర్ లో ఒక ఇంటికి చేరుకున్నారు.

ఇద్దరూ కారుదిగి లోనికి నడిచారు. లాల్ మెట్లెక్కి కాలింగ్ బెల్ బజర్ నొక్కి, సుజాతవంక చూశాడు'

ఆమె గాభరాగా చూసింది.

ఇంతలో తటాలున తలుపు తెరిచి ఒక యువకుడు ప్రత్యక్షమయ్యాడు.

"మిస్టర్ దివాకర్" లాల్ అడిగాడు.

"యస్, కమిన్" అన్నాడు దివాకర్ ప్రక్కకు తొలగి.

ఇద్దరూ లోనికెళ్ళారు.

"నాకు చాలా ఆనందంగా వుంది, మిస్టర్ లాల్! మిమ్మల్ని నా యింట్లో కలుసుకొంటానని వూహించలేదు! ఇవి మరపురాని క్షణాలు....ఓహ్, మిస్ సుజాత! ఎలా వున్నారు? మీ డాడీ ఆరోగ్యం బాగుందా? ఆయన్ను మీరు జాగ్రత్తగా కాపాడాలని మరువకండి!"

సుజాత అయోమయంగా చూసింది.

దివాకర్ మళ్ళీ అన్నాడు, "కూర్చోండి, మిస్టర్ లాల్. సుజాతను ఇలా అప్ సెట్ చెయ్యడం నాకే మాత్రమూ ఇష్టంలేదు. కాని పొట్టకోసం దుర్మార్గం చేయవల్సి వచ్చినప్పుడు స్త్రీ పురుష భేదం వుండదు!"

"మీ వృత్తి ఏమిటి? బ్లాక్ మెయిల్?...."

"కాదు—"

"మీ యింట్లో చాలా విలువైన వస్తువులున్నాయి."

"అవును. సంపాదించేవాడికి అనుభవించే హక్కు వుంది."

"అక్రమ సంపాదనతో కాదు."

"మీరు సక్రమమైన పదాలు వాడండి! మిస్టర్ లాల్, పరిస్థితి విషమించడం నా కిష్టంలేదు. ఈ బిజినెస్ ప్రశాంతంగా ముగిద్దాం. నా వ్యక్తిగత వివరాలతో మీకు పని లేదు."

"ఆల్ రైట్. మీరు ఉత్తరాలు చూపించండి!"

లాల్ చేతిలో బ్రీఫ్ కేస్ ను చూసి దివాకర్, "దానిలో ఏముంది?" అన్నాడు.

"నా సరంజామా—మీ కభ్యంతరమా?"

దివాకర్ అడ్డంగా తలూపి జేబులోంచి రివాల్వర్ తీశాడు. "కాదు, కానీ మిస్టర్ లాల్, మీ రెలాంటి పిచ్చిపనులు చెయ్యకూడదు! ఉత్తరాలు నా దగ్గర వున్నంత వరకు నా చేతిలో రివాల్వర్ వుంటుంది."

"మంచిది, మీ దగ్గరెన్ని వుత్తరాలున్నాయి?"

"నాలుగు."

"వాటికి డూప్లికేట్స్?"

"లేవు. మీరు పూర్తిగా నమ్మవచ్చు. ఇలాటి విషయాల్లో నమ్మటం కష్టం. అయినా నమ్మితీరాలి తప్ప మీకు గత్యంతరం లేదు!" దివాకర్ గిరుక్కున తిరిగి వెనుక గదిలో కెళ్ళిపోయాడు.

"నాకు భయంగా వుంది!" అంది సుజాత.

"దేనికి?"

"అతని దగ్గర రివాల్వర్ వుంది. మీరేం చేయ బోతున్నారు?"

లాల్ నోరు విప్పేలోపున దివాకర్ గ్లోవ్స్ తొడుక్కున్న చెరోచేతిలో రివాల్వర్, వుత్తరాలతో తిరిగి వచ్చాడు.

"సిడవున్, మై డియర్ ఫ్రెండ్స్! ఆ టేబిల్ దగ్గర కూర్చోండి!"

లాల్, సుజాత చెప్పినట్లు చేశారు. టేబిల్ మీద యెలాంటి వస్తువులూ లేవు. ఒక వెడల్పాటి అద్దం మాత్రం దానిమీద అమర్చి వుంది.

దివాకర్ రివాల్వర్ టేబిల్ మీద పెట్టి, ఉత్తరాలు మడత విప్పుతూ అన్నాడు. "మిస్టర్ లాల్, డీల్ సెటిల్ అయ్యేవరకూ మీరీ వుత్తరాలు ముట్టుకోకూడదు!"

"ఎందుకు?"

"ఆ అవకాశం మీకిస్తే మీరు వాటికి నిప్పంటించ వచ్చు—లేదా—వుండచుట్టి కిటికీలోంచి విసిరేస్తే అవతల మీ పార్ట్నర్ అందుకోవచ్చు?

నవ్వాడు లాల్, "జాన్ ఇక్కడ లేడు."

"ఆల్ రైట్, మీరు డిటెక్టివ్‌లు. మీ తెలివితేటల్ని నేను గౌరవిస్తానుగానీ, నా దగ్గర ప్రదర్శిస్తే మాత్రం సహించను. మరువకండి! నా చేతిలో రివాల్వర్ వుంది."

"ఈ ఉత్తరాల్ని నేను టేబిల్ గ్లాస్ క్రింద పరుస్తాను. మీరు కూర్చున్న చోటునుంచి కదలకూడదు! వీటిని ముట్టుకోకూడదు! అద్దంలోంచి వంగి వాటిని చదువుకో వచ్చు."

దివాకర్ టేబిల్ గ్లాస్ ఎత్తి నాలుగు వుత్తరాల్ని

పరిచి తిరిగి అద్దం పెట్టేశాడు.

సుజాత ఛటుక్కున ముందుకు వంగి చూసింది.

లాల్ దివాకర్‌ని ఓ క్షణం చూసి తరువాత ముందుకి వంగాడు. తెల్లటి మామూలు కాయితాలపైన సిరాతో వ్రాసిన నీలిరంగు అక్షరాలు అద్దంలోంచి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయిదు నిమిషాల్లో వుత్తరాలన్నీ చదివి సుజాతను చూశాడు. అవమానంతో ఆమె ముఖం ఎర్రబడింది "చాలా ఛండాలంగా వున్నాయి" అర్చిందామె.

లాల్ జేబులోంచి సుజాత తెచ్చిన కాగితం తీశాడు. అందులో ఉష దస్తూరీని, వుత్తరాల్లోని అక్షరాల్ని భూతద్దంతో మార్చి మార్చి చూసి, నెమ్మదిగా అన్నాడు. "సందేహం లేదు. ఇవి మీ చెల్లెలు వ్రాసినట్లుగానే వున్నాయి."

దివాకర్ గర్వంగా నవ్వుకున్నాడు.

"ఓహ్! వాటిని చింపేయండి, మీకు పుణ్యముంటుంది!" సుజాత అర్చింది.

దివాకర్ ఛటుక్కున ముందుకు జరిగాడు, "డీల్ యింకా సెటిల్ కాలేదు, సిస్టర్! ముందు డబ్బు విషయం మాట్లాడండి!"

"ఎంత కావాలి?" లాల్ అడిగాడు.

"పాతికవేలు."

లాల్ సుజాత వైపు తిరిగాడు, "మీరేమంటారు?"

"ఇప్పుడే చెక్కు వ్రాస్తాను!"

"నో అర్జెన్సీ! నేను చిటికె వేసేవరకు చెక్కు వ్రాయకండి!" దివాకర్ వైపు తిరిగి మళ్ళీ అన్నాడు లాల్. "వుత్తరాలు బావున్నాయి. అయితే నా షరతు మీకు తెలుసు...."

"ఏమిటి?"

"ఈ పుత్తరాలు ఫోర్జరీ అని మీకూ నాకూ తెలుసు కాబట్టి అదెలా జరిగిందో తెలుసుకుందాం!"

"అరె! అరెరె! మీరు చాలా గమ్మత్తుగా మాట్లాడుతున్నారు!" దివాకర్ రివాల్వర్ అందుకొని అర్చాడు.

"అవును. మీకు ముందే ఫోన్‌లో చెప్పాను. ఇవి దొంగ వుత్తరాలు కాకపోతేనే డబ్బు చెల్లించబడుతుంది."

"దొంగ వుత్తరాలైతే?"

"నయాపైసా ముట్టదు! ఏం చేసుకుంటారో చేసుకోండి!" లాల్ లేచి నిలబడ్డాడు, "పదండి సుజాతా, వెళ్ళిపోదాం!"

సుజాత కంగారు పడింది.

"ఆల్‌రైట్, ఆల్‌రైట్, మిస్టర్ లాల్. త్వరపడి నిర్ణయం తీసుకొంటున్నారు. ఈ వుత్తరాలు ఫోర్జరీ కావు!"

"మీ మాటలు వినదల్చుకోలేదు, నేను స్వయంగా ధృవపర్చుకోవాలి."

"ఎలా ధృవపర్చుకొంటారు?"

"ఆ ఉత్తరాల్ని ఫోటోలు తీస్తాను. వాటిని నాకు తెలిసిన ఎక్స్‌పర్టుకు చూపించి ఫోర్జరీ అవునో కాదో తెలుసుకుంటాను. అప్పుడే మీకు డబ్బివ్వవల్సిందీ లేనిదీ నిర్ణయించుకొంటాను."

"అందుకు నే నొప్పుకోను!"

"ఒప్పుకోకపోతే నూలువడుకుతూ కూర్చోండి! కాని వుత్తరాల్ని బయటపెడితే మాత్రం ప్రయోజనంలేదు. అవి ఫోర్జరీ అని నే నెప్పుడైనా నిరూపించగలను. మీరను

కుంటున్నట్లు ఎవరిపరువూ మంటగలవదు. ఇది గ్యారంటీ!"

దివాకర్ యిబ్బందిగా చూశాడు.

"మిస్టర్ లాల్, యిలాంటి సున్నిత పరిస్థితిలో మీరు మొరటుగా ఎందుకు వ్యవహరిస్తున్నారో అర్థంగావడం లేదు! ఈ ఉత్తరాలు ఫోర్జరీ కావని నాకు తెలుసు. మీతో పంతాలకుపోయి సుజాతకు అన్యాయం చేయదల్చలేదు. ఆల్ రైట్, రండి, మీ ప్రయోగాలు చేసుకోండి!"

లాల్ నవ్వి బ్రీఫ్ కేసులోంచి కేమెరా తీశాడు. దానికి ఎక్స్‌టెన్షన్ రాడ్ బిగించి చకచక నాలుగు స్నాప్స్ లాగి, తిరిగి పెట్టేసి థాంక్స్ చెప్పాడు.

"ఓ.కే, మిస్టర్ దివాకర్! నా నిర్ణయం సాయంత్రం తెలియజేస్తాను. మీ రింట్లోనే వుంటారా?"

"అవును."

"ఇక మేం వెళ్ళవచ్చా?"

"సంతోషంగా!"

లాల్ మారుమాట్లాడకుండా సుజాతతో బయట కొచ్చి కారెక్కాడు.

"లాల్, నా మాట వినండి! మీరేం చేస్తున్నారో నాకు తెలియదు! అవి దొంగ వుత్తరాలైనా కాకపోయినా డబ్బిచ్చి వాటిని స్వాధీనం చేసుకోవడం ముఖ్యం! వింటున్నారా?"

సుజాత మాటలకి లాల్ నవ్వాడు, "డిటెక్టివ్‌లు యెలాంటి బెదిరింపులకూ డబ్బు చెల్లించరు. అది మా వృత్తికే తలవంపు! పైగా తల వంచడమంటే నాకు చాలా నామోషీ కాదా! వెల్ సుజాతా, మీరు నిశ్చింతగా వుండండి! సాయంత్రం ఏడుగంటలకి పాతిక వేలకి

చెక్కుతో మా ఆఫీసుకు రండి! మిమ్మల్నెక్కడ డ్రాప్ చెయ్యను?" అడిగాడు.

3

సాయంత్రం నాలుగు గంటలకు లాల్ ఇచ్చిన నెగెటివ్‌ని డెవలప్ చేసి జాన్ ప్రింట్స్ తీశాడు. సరిగ్గా లాల్ చెప్పిన ఎన్‌లార్జిమెంట్‌లో వున్న ఆ బ్లోఅప్స్‌లో వున్న వుత్తరాల్ని చదివి బిత్తరపోయాడు.

లాల్ ఆ ఫోటోల్ని చూసి "గుడ్! ఆ వుత్తరాలు కూడా ఇవే సైజులో వున్నాయి—1/8 ఫుల్ స్కేల్" అన్నాడు మెచ్చుకోలుగా. "వీటితో ఇప్పుడు చాలా ముఖ్యమైన పని వుంది. అది నువ్వు చెయ్యాలి. ఈ ఫోటోల్లో మేటర్‌ని జాగ్రత్తగా చూడు! ఎన్ని పంక్తులున్నాయి? అక్షరాలెలా వున్నాయి? మార్జిన్, స్పేస్ ఎంత వున్నాయో, పైన తేది, క్రింద సంతకం యెలా వున్నాయో జాగ్రత్తగా గమనించు. ఇవి లైంగిక విశ్వాసం లేని వ్యక్తి సృష్టించిన నాలుగు అసభ్య లేఖలు—అతని అసంతృప్తికి ప్రతీకలు. వీటి స్థానంలో మనం నాలుగు సాధారణ ఉత్తరాలు తయారు చెయ్యాలి"

"ఎలా?"

"చెప్తాను, వ్రాసుకో!"

జాన్ పాడ్, కలం అందుకున్నాడు.

లాల్ అన్నాడు: "ప్రియమైన వసంతకు, నీ స్నేహితురాలు వ్రాయునది.... ముఖ్యంగా వ్రాయునదేమనగా, మా ఇంట్లో ఫోన్ చెడిపోవడంవల్ల నీతో మాట్లాడే అవకాశం లేకపోయింది. అందుకే ఆ శుభ సందర్భానికి రెండు రోజులు ముందుగా నీకీ వుత్తరం వ్రాస్తూ ఆహ్వానిస్తున్నాను. నా సంగతి నీకు తెలుసు కదా? ఇలు

కదలడమంటే నాకు మహా ఇది! — పేరాగ్రాఫ్—
ఇంతకూ ఆ శుభ సందర్భమేమిటో చెప్పనా? నేను కారు డ్రైవింగ్ ఇప్పుడు పూర్తిగా నేర్చుకున్నాను. ఎల్లుండి సాయంత్రం నిన్ను కార్లో కూర్చోబెట్టుకొని వూరంతా త్రిప్పాలని నాకు చాలా తహతహగా వుంది! తప్పకుండా వస్తావు కదూ?—ఇట్లు—నీ ప్రాణ స్నేహితురాలు—ఉష."

జాన్ వ్రాసుకొని తలూపాడు.

"ఇలాటివే మరో మూడు వివిధ రకాల ఉత్తరాలు తయారు చేయాలి. చేస్తావా?"

జాన్ ఉత్సాహంగా తలాడించాడు.

"ప్రేమలేఖలు కాదు!" లాల్ హెచ్చరించాడు.

జాన్ నవ్వి, "ఇంతకూ ఏమిటి నీ అయిడియా?" అన్నాడు.

"బ్లాక్ మెయిలర్ని ట్రిక్ చేయబోతున్నాను."

"ఎలా?"

"అతనికి తెలుగు రాదు. ఈ వీక్ పాయింట్తో నా ట్రిక్ ప్రయోగిస్తాను. హైద్రాబాదులో పేరు మోసిన ఫోర్జరర్ ఎవరు?"

"మాస్టర్ ఆచారి—ఆరు భాషల్ని అనర్గళంగా మాట్లాడమేగాక అక్షరం పొల్లుపోకుండా వ్రాయగలడు!"

"అలాటి మొనగాడే కావాలిప్పుడు! నేను చెప్పిన ఉత్తరంతోబాటు నువ్వు వ్రాసే మూడు వుత్తరాల్ని కూడా ఉష దస్తూరీలో ఫోర్జ్ చేయించాలి."

"ఆచారి మనల్ని చూసి చెయ్యడు!"

"అతను చేసేలా నువ్వొప్పించాలి! సాయంత్రం ఏడు గంటలకల్లా అవి సిద్ధంగావాలి! స్పెసిమెన్ కోసం ఆచారి

దగ్గరకు ఈ ఫోటోలు తీసికెళ్ళకు—ఉష వ్రాసిన గేయం పట్టుకెళ్ళు. దివాకర్ దగ్గరవున్న ఉత్తరాలు మామూలు తెల్లకాయితాల్లోనే వున్నాయి—క్రింద సేషనరీ షాపులో దొరుకుతాయి—ఈ ఫోటో సైజుకి కత్తిరించి తీసికెళ్ళు!"

4

సాయంత్రం ఆరు గంటలకి జాన్ తిరిగివచ్చాడు.

"సక్సెస్?" లాల్ అడిగాడు.

"నేను వెళ్ళడమూ, సక్సెస్ కాకపోవడమూనా! కల్లోకూడా అనుకోకు!" జాన్ బిగ్గరగా నవ్వి, కుర్చీలో కూలబడి, బ్యాగును లాల్ మీదకు విసిరాడు.

లాల్ గ్లోవ్స్ తొడుక్కొని బ్యాగులోంచి వుత్తరాలు తీశాడు. వాటిని కళ్ళు విశాలంగా చేసి చూసి, "వండర్ఫుల్!" అన్నాడు.

జాన్ అన్నాడు, "నాకో సందేహం వుంది....దివాకర్ కు తెలుగు రాకపోతే ఈ వుత్తరాలెలా సృష్టించగల్గాడు?"

లాల్ వులిక్కిపడ్డాడు. "అవును! నాకు తట్టనేలేదు! ఎలా సృష్టించాడు?"

"అతను సృష్టించలేదు. ఎవరో అదృశ్యవ్యక్తి.... లాల్, నీకు ఆచారి గురించి చెప్పాలి?"

"ఏమిటతని గురించి?"

జాన్ అన్నాడు: "నేనీ వుత్తరాలు ఫోర్జ్ చెయ్యాలని చెప్పినప్పుడు అతనికి అనుమానం కల్గింది. అది తనను పట్టుకోవడానికి పోలీసులు పన్నిన ట్రాప్ అనుకున్నాడు. కాదని నమ్మించేసరికి నా తల ప్రాణం తోకకొచ్చింది. చివరికి రెండువేలకి ఆశ పెట్టాను. ఒప్పుకొన్నాడు. నేనా వుత్తరాలిచ్చాను. అతను చదివి, దస్తూరీక్రింద సంతకం

చూసి వులిక్కిపడ్డాడు."

"ఎందుకు?"

"ఎందుకో అతను చెప్పలేదు. పైగా ఆ పనికి ఒప్పుకోలేదు. కారణం సనేమిరా చెప్పనన్నాడు. డబ్బు తిరిగి ఇచ్చేశాడు. అతని ప్రవర్తన నా కనుమానం కలిగించింది.. దివాకర్ దగ్గరవున్న వుత్తరాలు అతనే ఫోర్జ్ చేసి వుండాలి! అందుకే అతని క్లయంట్ ప్రయోజనాల్ని దెబ్బతీసే ప్రయత్నానికి ఒప్పుకోలేదు. ఈ విషయం నేను చెప్పేసరికి తెల్ల మొహం వేశాడు. నా అవసరానికి అతన్ని పోలీసులకి పట్టిస్తానని బెదిరించాను. అతను కాళ్ళ మీద పడి తిరిగి బిజినెస్ ఒప్పుకొన్నాడు."

"వెరీగుడ్! అతనిదగ్గర కొచ్చిన వ్యక్తి ఎవరు?"

"దివాకర్ కాదు. అతనికి యాభై యేళ్లుంటాయి. పేరూ వూరూ ఏమీ తెలియవట. వెయ్యి రూపాయ లిచ్చి నాలుగురోజుల క్రితం ఆ వుత్తరాల్ని వ్రాయించుకొని వెళ్ళాడట. అయితే అతను తెలుగువాడు."

"వెరీ ఇంట్రెస్టింగ్! దివాకర్ వెనుక మరో వ్యక్తి వున్నాడన్నమాట! సుజాత కుటుంబంతో పరిచయం వున్న వ్యక్తి...."

"ఎవరై వుంటాడు?" జాన్ అడిగాడు.

ఇదే ప్రశ్న సాయంత్రం యేడు గంటలకు సుజాత నడిగాడు లాల్.

ఆమె తికమకగా చూసి, "యాభైయేళ్ళ మనిషి.... తెలుగువాడు.... మా కుటుంబానికి తెలిసినవాళ్ళలో.... అందులోనూ గుర్నాగ్గుడు....ఆగండి! అతనెవరో నాకు తెలుసు!" అంది వుద్రేకంగా.

"ఎవరు?" లాల్ అడిగాడు ఆసక్తిగా.

"భూషణ్!" సుజాత అంది ఇంకా వుద్రేకంగా, "వారం క్రితం మా ఇంటికి వచ్చినట్టుగా ఉష చెప్పింది."

"అతనెవరో నిదానంగా చెప్పండి."

"భూషణ్ నాన్నకు చాలా కాలంగా తెలుసు. ఖమ్మంలో వుంటాడు. చిన్నవయసులోనే అతని భార్య అసహ్యించుకుని వదిలేసింది. మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. తరచు మా ఇంటికొచ్చేవాడు సంవత్సరం క్రితంవరకూ. అతన్ని చూస్తేనా ఒళ్ళు కంపరం పుట్టేది. అతని అలవాట్లూ ప్రవర్తన మంచివి కావు. అతన్ని రానివ్వద్దని నాన్నకి గట్టిగా చెప్పాక మానేశాడు. ఈ సంవత్సరమంతా కనిపించలేదు....

"కానీ వారం క్రితం మళ్ళీ వచ్చినట్లు ఉష చెప్పింది. నాన్నతో ఏవేవో విషయాలు రహస్యంగా మాట్లాడాడట. నేను ఆయన్ని గద్దించాను. భూషణ్ విషయం ఆయన చెప్పాడు. పదివేలు అప్పడిగాడట — ఏదో వ్యాపారం చెయ్యడానికి.

"మిస్టర్ లాల్, నాకిప్పుడంతా అర్థమవుతోంది— నాన్న తిరస్కరించడంతో డబ్బుకోసం వాడా వుత్తరాల్ని సృష్టించి బెదిరిస్తున్నాడు!"

జాన్ ముక్కుమీద వేలేసుకొని దీర్ఘాలోచనలో పడ్డాడు.

5

సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకు లాల్ దివాకర్ ఇంటికెళ్ళాడు.

దివాకర్ సంతోషంగా ఆహ్వానించాడు.

"ఏమాలోచించుకొన్నారు, మిస్టర్ లాల్?"

"చెక్కు ఇస్తాను."

"చాలా సంతోషం! కూర్చోండి, ఇప్పుడే వస్తాను."

దివాకర్ వెనుకగదిలోకి వెళ్ళాక లాల్ టేబిల్ దగ్గర కూర్చొని, ఎడమ కాలెత్తి కుడికాలు తొడమీద వేశాడు. ఆ తర్వాత సిగరెట్టు వెల్గించి రెండు దమ్ములు లాగాడు.

దివాకర్ తిరిగి వచ్చాడు — మధ్యాహ్నం వచ్చిన భంగిమలో—గ్లోవ్స్, రివాల్వర్, వుత్తరాలతో.

"ఆల్ రైట్, మిస్టర్ లాల్, మీరు చెక్కు తీసి టేబిల్ మీద పెట్టండి నేను వుత్తరాలిస్తాను."

లాల్ జేబులోంచి చెక్కు తీసి టేబిల్ మీద పెట్టాడు. దివాకర్ అందుకొని దాన్ని పరీక్షగా చూసి తలూపాడు.

"థాంక్స్, వుత్తరాలు తీసుకోండి—"

ఒక చేతో దివాకర్ నించి వుత్తరాలు తీసుకుంటూనే లాల్, మరో చేతో ఎడమకాలు ప్యాంటు అంచుల్ని పిక్కల వరకూ లాగి, అక్కడ రబ్బర్ బాండ్‌లో చుట్టివున్న వుత్తరాల్ని చటుక్కున తీశాడు.

దివాకర్ వుత్తరాలందించి సిగరెట్ కోసం సొరుగు లాగుతుండగా, లాల్ క్షణంలో దివాకర్ వుత్తరాల్ని రబ్బర్ బాండ్‌లో ఇరికించి, కాలును నేలమీద పెట్టేశాడు.

ఇద్దరిమధ్య టేబిల్ ఈ చర్యమీద తెర కప్పింది.

ఇప్పుడు లాల్ చేతిలో తను తెచ్చిన మారు వుత్తరాలున్నాయి. వాటిలో ఒకదాని మడత విప్పి చూస్తూ ముఖం చిట్లించసాగాడు. గబగబ మిగిలిన వుత్తరాల్ని చూశాడు. వెంటనే అతని ముఖం కోపంతో యెర్రబడింది.

"ఏమిటిది దివాకర్! మీరు పొరబడ్డారు! నాకివ్వవలసిన వుత్తరాలివి కావు!"

దివాకర్ సిగరెట్ వెలిగించి ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏమిటి మీర నేది?"

"చూడండి!" వుత్తరాల్ని ముందుకు తోశాడు లాల్
"ఇవి హృదయం చూపించిన వుత్తరాలు కావు!"

దివాకర్ వాటిని చూసి అటూ ఇటూ తిరగేశాడు.

"ఈ వుత్తరాలు మీవి కావా?"

"గాడ్! నావి కావు! కావలిస్తే చదివి చూడండి!"

"క్రింద సంతకం చూడండి! అదే సంతకం!"

"నాన్సెన్స్! మీకు తెలుగు రాకపోతే ఎవరి చేతనైనా చదివించి అర్థం తెలుసుకోండి! ఇవి హృదయం చూపించిన ప్రేమ లేఖలు కావు! మీరు మోసం చేస్తున్నారు!"

"ఆగండి మిస్టర్ లాల్!" దివాకర్ మళ్ళీ వుత్తరాల్ని అందుకొని చూశాడు, "అవే అక్షరాలు, అదే వ్రాత, అదే సంతకం! కాదంటారేమిటి!"

లాల్ చటుక్కున లేచి నిలబడ్డాడు, "చెక్కిలా ఇవ్వండి! ఆ వుత్తరాలు డబ్బు చెల్లించాల్సినంత ముఖ్యమైనవి కావు! ఏం చేసుకుంటారో చేసుకోండి। క్విక్! చెక్కు——"

"ఆగండి, మిస్టర్! మోసం ఎక్కడుందో నాకు తెలుసు!" దివాకర్ తటాలున ముందుకొచ్చి రివాల్వర్ గురిపెట్టాడు, "చేతులెత్తండి! మీరు వుత్తరాలు తెచ్చి మీరే మోసం చేస్తున్నారు! మిమ్మల్ని పూర్తిగా సోదా చెయ్యాలి——కదలకండి!"

లాల్ చేతులెత్తి కఠినంగా అన్నాడు. "నన్నిలా ట్రీట్ చేస్తున్నారు! తర్వాత చింతిస్తారు మిస్టర్!"

"ఓహ్। నీరసం వస్తోంది! మీ కూతలు కట్టిపెట్టండి!"

దివాకర్. లాల్ షర్టునీ, ప్యాంటునీ పూర్తిగా సోదా చేశాడు. అతని ముఖం యెర్రబడి, కలవరంగా దిక్కులు చూశాడు.

"ఇదెలా జరిగింది, ఓహ్!"

"మీ సేఫ్‌లో కలిసిపోయాయేమో చూడండి!"

"నా దగ్గర సేఫ్ లేదు. వేరే వుత్తరాలూ లేవు!"

"అయితే బాగా ఆలోచించి అసలు వుత్తరాలు ఎక్కడ పెట్టారో తెలుసుకోండి. నాకు మరో అర్జంటు పని వుంది, చెక్కిలా ఇవ్వండి!"

దివాకర్ ముఖం ఒక్కసారిగా వెల్గింది, "మిస్టర్ లాల్! నా కిప్పుడర్థమైంది! అసలు వుత్తరాలెక్కడ వున్నాయో—అసలు మర్మం ఎక్కడుందో తట్టింది! మీరు వెళ్ళండి! పది గంటలకు ఫోన్ చేసి ఏ విషయం చెప్తాను....మీరు వెళ్ళండి ప్లీజ్!"

దివాకర్ అందించిన చెక్కు తీసుకుని, లోలోన నవ్వుకుని బయటికి నడిచాడు లాల్. ఆఫీసుకెళ్ళేసరికి అక్కడ సుజాత, జాన్ అసహనంగా ఎదురు చూస్తున్నారు.

"ఏమైంది?" సుజాత అర్చింది.

లాల్ జేబులోంచి చెక్కు తీసి టేబుల్ మీద పెట్టాడు. సుజాత ఆదిరిపడి అంది. "వుత్తరాలు తేలేదా?"

లాల్ నవ్వాడు, "డబ్బూ ఉత్తరాలు రెండూ తెచ్చాను!" అంటూ ప్యాంటు లేపి, రబ్బర్ బాండ్‌లోంచి ఉత్తరాలు తీసి సుజాత వొళ్ళో విసిరాడు.

"ఇవి-ఈ చెక్కు-ఓహ్-ఏమిటిది!"

"ట్రిక్. ఈ దెబ్బకి బ్లాక్ మెయిలర్ ఈ ఉత్తరాలకి డూప్లికేట్స్ వుంటే బయటికి తీస్తాడు. మీరు డూప్లికేట్స్ విషయం కూడా తేల్చమని కోరలేదూ?"

"తమాషాయంగా వుంది! వాడు డూప్లికేట్స్ తీస్తే ఏం చేస్తారు? ఇంకేం ట్రిక్ వుంది? డబ్బిచ్చేస్తారా!"

"నో—ముందు అతను డూప్లికేట్స్ లేవని నమ్మించాడు. ఇప్పుడు వాటిని అమ్మకానికి పెడితే నేను కోర్టులో కేసు పెడతాను!" నవ్వాడు లాల్, "మీకో విషయం చెప్పాలి. ఆ మూరు వుత్తరాలు వాళ్ళిద్దరి మధ్య తగువు పెట్టాయి. ఆ ఉత్తరాలు చూసి ముందు గొడవ పెట్టినా దివాకర్ కు తర్వాత ఏదో తట్టి నన్ను వెళ్ళిపొమ్మన్నాడు. ఆఫీసుకు ఫోన్ చేస్తానన్నాడు. అంటే భూషణ్ యేదో గూడుపుఠాణీ నడుపుతున్నాడని అతని అనుమానం. కాని, ఆ వుత్తరాలు చూసి భూషణ్ ఏమనుకొంటాడు? దివాకర్ అసలు వుత్తరాలు అమ్ముకొని మోసం చేశాడని కయ్యానికి దిగుతాడు! అరమైందా! కాబట్టి మీరేమీ భయపడకండి! దివాకర్ ఏమని ఫోన్ చేస్తాడో ఎదురు చూద్దాం!"

కానీ ఆ రాత్రి దివాకర్ నుంచి ఫోన్ రాలేదు.

6

మర్నాడు వుదయం 10 గంటలకు సుజాత నుంచి ఫోన్ వచ్చింది. "మిస్టర్ లాల్, ఈ విషయం చెప్పడాని కాలస్యం చేసినందుకు క్షమించండి.... ఈ వుదయం మా నాన్నగారు పోయారు...."

లాల్ వులిక్కిపడ్డాడు "ఏమిటీ!"

"రాత్రి నిద్రలో గుండె ఆగిందని డాక్టర్ చెప్పాడు" సుజాత కంఠంలో గాంభీర్యం సడలలేదు.

లాల్ అసహనంగా చెంపలు రుద్దుకొని జాన్ ని చూశాడు.

"చాలా ఆశ్చర్యంగా వుంది, మిస్ సుజాత! నమ్మలేక

పోతున్నాను....”

అవతల బలహీనంగా నవ్వు.

“లాల్, ఒకసారి మా ఇంటికొస్తారా-ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి?”

“వస్తాను” లాల్ రిసీవర్ పెట్టేసి భారంగా వూపిరి వదిలాడు.

“ఆమె తండ్రికేమయింది?” జాన్ ఆతృతగా అడిగాడు.

“గుండె ఆగింది.”

డిటెక్టివ్‌లు సుజాత ఇంటికి చేరుకొనే సరికి అక్కడ చాలా మంది వున్నారు: ఇరుగు పొరుగు వాళ్ళూ, స్నేహితులూ....

హాలు ప్రక్కన పడగ్గదిలో సుజాత యెదురై, తండ్రి దేహాన్ని చూపించింది. జాన్ దేహంమీద పుష్పగుచ్ఛం వుంచాడు. ఆమె తండ్రి వయసు సుమారు అరవై వుంటుంది. ప్రశాంతంగా శ్వాస వదిలినట్టు ముఖం చెప్తోంది.

పైకి గాంభీర్యం ప్రదర్శిస్తోన్నా, లోలోపల దుఃఖానికి ఆనకట్ట వేయలేక సతమతమవుతోన్న సుజాత, లాల్ చెయ్యిపట్టుకొని మరో గదిలోకి తీసికెళ్ళింది. జాన్ వాళ్ళ ననుసరించాడు.

ఆమె గదితలుపు మూసి, పరుపు క్రిందనుంచి కొన్ని కాగితాలు తీసి లాల్ చేతిలో పెట్టింది.

“ఏమిటివి?”

“ఉత్తరాలు!”

లాల్ చటుక్కున వాటిని విప్పి చూశాడు. అవి దివాకర్ దగ్గర తస్కరించిన అసలు వుత్తరాల తాలూకు ఫోటోస్టాటిక్ కాపీలు.

"ఎక్కడివి!" అన్నాడు ఆశ్చర్యంగా.

"నాన్న తలగడ క్రింద వున్నాయి...."

"ఎలా వచ్చాయి?"

"రాత్రి ఆయన దివాకర్ దగ్గరికెళ్ళారు."

"ఏమిటీ!"

"అవును లాల్, అంతా అయోమయంగా వుంది! రాత్రి నాన్న దివాకర్ యింటికెళ్ళి యీ వుత్తరాలు తెచ్చారు!"

"మీ కెలా తెలుసు?" జాన్ అరిచాడు.

"నేను చూశాను....రాత్రి ఒంటి గంటకనుకుంటాను, కారు శబ్దమైతే కిటికీ దగ్గర కెళ్ళి చూశాను. రాత్రి నాకో పట్టాన నిద్రలేదు. కారు శబ్దానికి మేల్కొని చూశాను. నాన్న కారు డ్రైవ్ చేసుకుంటూ గేటువరకు వెళ్ళి, అక్కడ దిగి గేటు తెరిచాడు. అప్పుడు స్పష్టంగా చూశాను. ఆయన ఒంటిమీద నల్లటి లాంగ్ కోటు వుంది- అది ఆయనదే. నాకేమీ అర్థంకాలేదు. ఆయన తిరిగి కారెక్కి వెళ్ళిపోయారు."

"అప్పుడు నా కామెను సెన్స్ మేల్కొంది. బయట కరికి ఆయన్నాపాలనుకున్నాను. ఆయన గుండెజబ్బు మనిషి—ఎలాటి శ్రమ తీసుకోకూడదు. ఎన్నడూ లేనిది అలా అర్థరాత్రి ఆయన యెక్కడికి బయలుదేరాడో అంతుబట్టలేదు! ఒకవేళ స్లీప్ వాకింగ్ చేస్తున్నాడేమోనని భయపడ్డాను."

"అప్పుడేం చేశారు?"

"నేను వీధిలోకరికేటప్పటికి కారు మలుపు తిరుగుతోంది. నా కంటుబాటులో ఏ వాహనమూ లేదు! మెయిన్ రోడ్డు వరకూ పరిగెత్తాను. అక్కడా ఏమీ లభించ

లేదు పదినిమిషాల వరకూ. ఇంతలో ఒక ఆటో దొరికింది. కానీ యెక్కడికెళ్ళాలో తెలియదు! నాన్న కారు కను మరుగై యెక్కడికెళ్ళిందో తెలియలేదు. వెంటనే మెరుపు లాటి ఆలోచన వచ్చి దివాకర్ ఇంటికి బయలుదేరాను."

ఊపిరి తీసుకొని మళ్ళీ అంది సుజాత: "ఎక్కడో జరిగిన పొరపాటువల్ల ఈ బ్లాక్ మెయిల్ నాన్నకు తెలిసి పోయిందనుకున్నాను. అయితే నాన్నకు దివాకర్‌తో ఘర్షణ తప్పదు! కానీ-నేనక్కడి కెళ్ళేసరికి కారూలేదు, నాన్నా లేడు!"

"మరి?"

"నేనా యింటికి దూరంగానే వుండి చూశాను. కారు లేదు—అయితే అక్కడికి రాలేదనుకొని తిరిగి వచ్చేశాను. ఆశ్చర్యం! అప్పుడు కారు ఇంట్లో వుంది."

"అయితే ఏం చేశారు?"

"తేలికపడి, లోనికెళ్ళి నాన్నగదిలో చూశాను. ప్రశాంతంగా నిద్రపోతున్నారు. కోటు హాంగర్‌కి వేలాడు తోంది. పెద్దగండం తప్పినందుకు సంతోషించి వచ్చి నిద్ర పోయాను.

"ఇంతలో తెల్లవారుతోండగా ఉష కేకలు విన్పించి పరిగెత్తికెళ్ళాను. నాన్న ప్రాణాలు విడిచారు. రాత్రి ఆయన డ్రైవ్ చేయడంవల్ల గుండెమీద స్ట్రెయిన్ పడింది. చనిపోయారు!" సుజాత గాఢంగా వూపిరి పీల్చి దుఃఖం దూరం చేసుకొంది.

"అప్పుడాయన తలగడ సవరిస్తునప్పుడు ఈ వుత్తరాలు దొరికాయి. నా ఆశ్చర్యానికంతులేదు! రాత్రి నాన్న భూషణ్ దగ్గరికెళ్ళి బ్రతిమాలి వాటిని తెచ్చారు—"

"ఆగండి, భూషణ్ ఎక్కడుంటాడు?"

"హోటల్స్‌లో తిరుగుతుంటాడు."

"ఉష యెక్కడ వుంది?"

"పైన గదిలో. ఆమెని ఓదార్చడం యెవరి తరమూ కాలేదు! పిచ్చిగా కేకలు పెడుతూ నాన్నమీద పడి ఏడ్చింది! ఇప్పుడు డాక్టర్ ఆమెని సెడేషన్‌లో వుంచాడు."

లాల్ నిట్టూర్చాడు. "సరే, మేం ఇప్పుడు దివాకర్ దగ్గరికెళ్తాం. రాత్రి అక్కడేం జరిగిందో, అతనెందుకు ఫోన్ చేయలేదో తెలుసుకోవాలి" అని, మృదువుగా సుజాత చెయ్యి నిమిరి బయటికి దారితీశాడు.

శాంతినగర్‌లో దివాకర్ యిల్లు చేరుకొనేటప్పటికి సమయం సరిగ్గా 11-30 అయింది.

ఇల్లు నిశ్శబ్దంగా వుంది. జాన్ కాలింగ్ బెల్ నొక్కితే సమాధానం లేదు. లాల్ దివాకర్‌ని పిల్చినా బదులు లేదు. నెమ్మదిగా తలుపు నెట్టి లోనికెళ్ళారు. ఇంట్లో యెక్కడా కదలిక లేదు.

లాల్ గబగబ గదులన్నీ తిరుగుతూ చూడసాగాడు. చివరికి ఓరగా వేసివున్న కిచెన్ తలుపు తెరిచి అప్రయత్నంగా ఆగిపోయాడు.

లోపల ఒక శవం బోర్లా పడివుంది.... దాని తల రెండుగా చీలిపోయి, రక్తం విశాలంగా మడుగు కట్టింది.

లాల్ సైగచేసి జాన్‌కు చూపించాడు.

జాన్ లోనికి తొంగిచూసి, "ఓహ్! దిసీజ్ టూ కాంప్లికేటెడ్!" అనర్చాడు.

7

ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణన్ చకచక నడిచి లోనికి వచ్చి "హల్లో ఫ్రెండ్స్! మీరు మరో శవం కనుక్కున్నారట?"

అన్నాడు.

"మరో శవం కాదు—ఓ శవం" అన్నాడు జాన్.

"ఓహ్, సారీ! మరో కేసు గురించి ఆలోచిస్తూ ఏదో అనేశాను—ఈ మధ్య మెదడంతా గజిబిజిగా ఉంది! శవం ఏది?"

లాల్ కిచెన్ తలుపు విశాలంగా తెరిచాడు.

కృష్ణన్ లోనికి చూసి ఒక్క అడుగు వెనక్కి వేశాడు, "చాలా ఘోరం! యెవరతను?"

"తర్వాత అన్నీ తెలుస్తాయి....మీ సిబ్బందిని పిలవండి!"

లాల్ లోనికెళ్లి చుట్టూ కలయజూశాడు.

గదిలో తలుపుకు కుడివైపు ఉన్న టేబిల్ దగ్గర శవం పడివుంది. హతుడి వయసు సుమారు 50 ఉంటుంది. తల వెనుకభాగం నాలుగంగుళాల మేరకు రెండుగా చీలిపోయి, లోపలి భాగాలు కన్పిస్తున్నాయి. తల చుట్టూ రక్తం మడుగుకట్టి ఘనీభవించింది. ముఖం రక్తంలో మునిగివుంది. చేతులు విశాలంగా చాపి వున్నాయి. కాళ్ళు దగ్గరగా చేర్చి ఉన్నాయి. ఒంటిమీద తెల్లటి షర్టు ఖాకీప్యాంటు ఉన్నాయి. పాదరక్షలు లేవు. కుడిపాదం ప్యాంటు అంచు నూనెలో బాగా తడిసినట్లు కనిపిస్తున్నాయి.

లాల్ కళ్ళు శవం ఎడమకాలి ప్రక్కన అడుగు దూరంలో పడ్డాయి. అక్కడ నూనె మడుగుకట్టింది. తలెత్తి టేబుల్ మీద చూశాడు.

టేబిల్ మీద కిరోసిన్ స్టవ్, దానిమీద పెనం, పెనంమీద ఒక ఆమ్లెట్ ఉన్నాయి. ఆమ్లెట్ పూర్తిగా నల్లగా మాడిపోయి వుండి. స్టవ్ ప్రక్క చిన్న ప్లాస్టిక్

బుట్టలో నాలుగు గ్రుడ్లున్నాయి. అక్కడే రెండుసీసాల్లో కారప్పొడి, ఉప్పు వగైరా ఉన్నాయి. టేబిల్ అంచు మీద నుంచి నూనెడబ్బా ఒలికి నూనె అంతా నేల పాలయ్యింది.

ఈ దృశ్యాన్నంతా చూస్తున్న జాన్, ఛటుక్కున వంగి టేబిల్ క్రింద నుండి రెండు గ్రుడ్డు పెంకులు తీశాడు.

"పెనంమీద ఒక ఆమ్లెట్ వుంది. మరొకటి కడుపులో ఉండాలి" అన్నాడతను.

లాల్ తలూపి, "శవం కదల్చబడిందని నా అను మానం" అన్నాడు.

"ఎలా?"

"శవం తల చూడు—గాయం వెనుకభాగంలో ఉంది. అంటే అతను స్టవ్ ముందు నిలబడి వంట చేస్తున్నాడు. కుడిచేతివైపు నూనె డబ్బా ఉంది. ఇందులో వెనుకనించి దెబ్బపడింది....అప్పుడేం జరుగుతుంది?"

"అతను వెనక్కి విరుచుకు పడతాడు. అలా పడు తున్నప్పుడు కుడిచెయ్యి నూనెడబ్బాని తాకివుండాలి.... డబ్బా పడిపోయి నూనె నేలపాలయ్యింది" అన్నాడు జాన్.

"దటీజ్ రైట్. అందుకే కుడిపాదం నూనెలో తడిసి ఉంది. అంటే అతను వెల్లకిలా పడ్డాడన్న మాట. అంటే కుడిపాదం ఆ నూనెమడుగులో లేదా, దాని దిశలో ఉంటుంది. కానీ యిప్పుడు శవం బోర్లా పడివుంది. నూనె మడుగువేపు కుడికాలుగాక ఎడమకాలు ఉంది. అదీ అడుగుదూరంలో! అంత బలమైన దెబ్బ పడ్డాక అతను కదిలే ప్రయత్నం చేసి వుంటాడనుకోను."

"అయితే శవం యెలా కదిలింది?"

"తర్వాత ఆలోచిద్దాం" అని, శవాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ రఘునాథ్ వైపు తిరిగాడు లాల్.

డాక్టర్ అన్నాడు, "ఇన్‌స్పెక్టర్, చావు రాత్రి సంభవించిందని మీకు తెలుసు. సరిగ్గా ఏ సమయంలో సంభవించిందో పోస్ట్‌మార్టమ్‌లో చెప్తాను. అయితే, యిటు చూడండి.... మెడదగ్గర గడ్డకట్టిన రక్తంలో కొన్ని పోగులు అంటుకొని ఉన్నాయి. ఏమిటివి?"

కృష్ణన్ వంగి పరీక్షించాడు, "ఉన్నిపోగులు...."

"స్వెటర్‌వి అనుకుంటాను" డాక్టర్ అన్నారు.

జాన్ అడ్డంగా తలూపి లాల్‌తో అన్నాడు, "ఈ పోగులు సుజాత తండ్రి కోటువి అనుకుంటాను. రాత్రి ఘర్షణలో...."

లాల్ భారంగా నిట్టూర్చి డాక్టర్‌ని అడిగాడు: "గాయం దేనివల్ల అయింది?"

డాక్టర్ గాయాన్ని కాస్సేపు పరీక్షగా చూశాడు.

"గాయాన్నిబట్టి చూస్తే హత్యాయుధం గొడ్డలి అయి వుండాలి."

రకరకాల నిపుణులు యెవరి పనులు వారు చకచక చేసుకుపోతున్నారు. లాల్ కృష్ణన్‌తో బయటకొచ్చి మిగతా గదులు సోదా చేశాడు. ఇంట్లో ఎక్కడా సేఫ్ లాంటిది లేదు. ఎక్కడా సోదా జరిపిన సూచనలులేవు. డ్రాయింగ్ రూం టేబుల్ సొరుగులో రివాల్వర్, గ్లోవ్స్ ఉన్నాయి. రివాల్వర్ ఖాళీగా ఉంది. బెడ్ రూంలో మంచంమీద దుప్పటి, దిండు చెదరకుండా ఉన్నాయి. మిగతా వస్తువులన్నీ యథాస్థానంలో ఉన్నాయి.

ఇంతలో జాన్ డాక్టర్‌తో గదిలోకొచ్చాడు. లాల్

ఏమిటన్నట్టు చూశాను.

జాన్ అన్నాడు: "లాల్, భూషన్ హోటల్స్‌లో దిగుతాడని సుజాత చెప్పింది కాబట్టి అతని దగ్గర రూం తాళంచెవి ఉండాలి. కానీ దుస్తుల్లో యెక్కడా లేదు."

"ఘర్షణలో ఎక్కడైనా పడచ్చు. గదిని క్షుణ్ణంగా గాలించారా??"

"మిస్టర్ లాల్, హతుడు ఎలాటి ఘర్షణలోనూ పాల్గొనలేదు!" అన్నాడు డాక్టర్.

"ఓహ్! యెలా చెప్తున్నారు?"

"అతని దుస్తులు, దేహం చెప్తున్నాయి: బట్టలు ఎక్కడా చిరిగిలేవు. ఎక్కడా గుండీలు వూడలేదు. ఒంటిమీద యెక్కడా గాట్లుగానీ వాపులుగానీ లేవు."

"వెరీవెల్! అయితే శవాన్ని కదిల్చి హంతకుడు తాళంచెవి తీసుకొనుండాలి. జేబుల్లో ఇంకేమున్నాయి?"

"కొంత డబ్బు. ఇంకేమీ లేదు" అన్నాడు జాన్.

"సరే, హత్యాయుధం కన్పించిందా?"

"లేదు— ఇల్లంతా గాలించాను."

కృష్ణన్ అన్నాడు: "నా అనుమానం హంతకుడు గొడ్డలి కూడా తెచ్చుకొనుండాలని. ఏమంటారు? ఈ ఇంట్లో గొడ్డలి ఉండేందుకు తగిన కారణం కన్పించటం లేదు. ఇంట్లో ఎక్కడా కట్టెలపొయ్యి లేనప్పుడు గొడ్డలి అవసరమేమిటి? పోనీ, కొమ్మలు నరకడానికి పెద్ద వృక్షం కాదు కదా—ఎడారిలాంటి ఈ ఇంట్లో ఆడ ఛాయలెక్కడా లేవు కనీసం ఓ పూలమొక్కకి ప్రాణం పోయడానికి. నో, నో— హంతకుడు గొడ్డలితో వచ్చి హత్యచేసి తిరిగి దానితో వెళ్ళిపోయాడు."

లాల్ సాలోచనగా తలూపి ఫోన్ వైపు కదిలాడు.

ఒక నెంబరు డయల్ చేసి కాచుకున్నాడు. కొన్నిక్షణాల తర్వాత సుజాత కంఠం నీరసంగా పలికింది. "ఎవరది?"

"లాల్ ని.... సుజాత, పరిస్థితి ఇప్పుడు చాలా విచిత్రంగా తయారైంది!"

"ఏం జరిగింది?"

"ఎలా చెప్పాలో తెలియటంలేదు. మీరు తట్టుకొంటారా? భూషణ్ ఇక్కడ చచ్చి పడి ఉన్నాడు."

అవతల ఒక్క క్షణం నిశ్శబ్దం. ఆ తర్వాత సుజాత కంఠంలో గాంభీర్యం ప్రదర్శించే ప్రయత్నం చేస్తూ అంది. "లాల్, నాన్న వాడ్ని చంపాడంటే మీరు నమ్ముతారా?"

"శవంమీద కొన్ని పోగులున్నాయి—నల్లటివి. మీ నాన్న కోటు కూడా నల్లదేననుకొంటాను. త్వరలో దాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని లాబ్ కి పంపుతారు...."

"ఓహ్! అయితే ఇప్పుడేమిటి? ఏం జరుగుతుంది?"

"హత్య గొడ్డలితో జరిగింది. మీ ఇంట్లో గొడ్డలి ఉందా?"

సుజాత ఊపిరి బిగబట్టింది. "ఉంది...."

"ధైర్యంగా ఉండండి! ఈ మొత్తం వ్యవహారం నేనిప్పుడు పోలీసులకు చెప్పేస్తాను. మీ చెల్లెలి జీవితాన్ని కాపాడానికి మీ నాన్న ప్రాణాల్ని లెక్క చెయ్యకుండా మిత్రద్రోహిని శిక్షించడానికి పూనుకొన్నారు. ఆయన అంత్య క్రియలు మీరు హృదయపూర్వకంగా ముగించండి. ఆయనపట్ల ఎలాంటి ఏహ్యభావం కల్పించుకోకండి."

ఇన్ స్పెక్టర్ చెవులు రిక్కించి లాల్ మాటలు వింటున్నాడు.

లాల్ ఫోను పెట్టేసి డాక్టర్ ని నవ్వుతూ చూశాడు.

డాక్టర్ తడబడ్డాడు.

"వెల్, డాక్టర్ హతుడు ఘర్షణలో పాల్గొనకపోతే అతని మెడదగ్గర ఉన్నిపోగులెలా వచ్చాయి?"

డాక్టర్ ఇబ్బందిగా మొహం పెట్టాడు.

8

తిరిగి యేజెన్సీ ఆఫీసుకొచ్చి డిటెక్టివ్‌లు తీవ్రమైన ఆలోచనల్లో పడ్డారు. క్రింద రోడ్డుమీద రోజురోజుకీ పెరిగిపోతున్న ట్రాఫిక్ ఆలోచనల్ని చెదరగొడ్తోంది.

పది నిమిషాలు గడిచాక జాన్ అడిగాడు, "అయితే దివాకర్ పారిపోయాడంటావా? సుజాత తండ్రి గొడ్డలితో ప్రత్యక్షం కావటంతో చేతులెత్తి దండంపెట్టి కాలికి బుద్ధి చెప్పాడు—అంతేనా?"

"సరిగ్గా అంతే!" అన్నాడు లాల్ తేరుకొని, "సుజాత తండ్రి గొడ్డలితో అక్కడికెళ్ళాడంటే ముందూ వెనుకా ఆలోచించకుండా భూషణ్ తల పగులగొట్టాలనే అనుకొన్నాడు. కాబట్టి పగులగొట్టాడు. దివాకర్ ఆ క్షణంలో పలాయనం చిత్తగించి ప్రాణాలు రక్షించుకున్నాడు. ఇక ఇంటి పరిస్థితి చూస్తే సుజాత తండ్రి డూప్లికేట్ ఉత్తరాలకోసం ఎక్కడా సోదా చేసిన సూచనలు లేవు. అతను భూషణ్ జేబులోంచి హోటల్ తాళం తీసుకొని, అక్కడికెళ్ళి ఉత్తరాలు తెచ్చుకున్నాడు."

"అందువల్ల అతని కోటు పోగులు శవాన్ని కదిలిస్తున్నప్పుడు అంటుకొని ఉండాలి." అన్నాడు జాన్.

"కావచ్చు...." లాల్ అన్నాడు. "ఇక ఇందులో మనం చేసేదేమీ కన్పించటంలేదు. ఓపెన్ అండ్ షట్

APS 11

కేసు. ఇరుపక్షాలవారికీ న్యాయం చేకూరింది—"

హఠాత్తుగా ఫోన్ మ్రోగటంతో లాల్ రిసీవరందుకొని "హలో!" అన్నాడు.

"మిస్టర్ లాల్! గుడ్ న్యూస్!" కృష్ణన్ గొంతు పలికింది.

"వ్హాట్!"

"దివాకర్ని పట్టుకున్నాం! అతనింటికి వచ్చాడు.... అతను చెప్పే కథ నా ద్వారా గాక అతనితోటే స్వయంగా చెప్పించాలనుకుంటున్నాను...."

"అతన్నిక్కడికి తీసుకరండి!"

"అలాగే. తర్వాత మరో బ్యాడ్ న్యూస్...."

"ఏమిటి?"

"దివాకర్ ఎదురింటి అతను నిన్న రాత్రి సెకెండ్ షో చూసి వస్తూ ఇంటి ముందు ఒక కారును చూశాడు. ఇంతలో ఒక అమ్మాయి గాభరాగా అందులో ఎక్కుతూ కన్పించింది—ఆమె దివాకర్ ఇంట్లోంచి గేటు తెరుచుకొని వచ్చిందట. నల్లటి లాంగ్ కోటులో వుంది. అప్పుడు సమయం సరిగ్గా 1:20 అవుతోంది. స్ట్రీటు లైటు వెలుగులో అతడామెను స్పష్టంగా చూశాడట—"

"ఆమె యెవరో తెలుసా?" ముఖం ఎర్రబడింది.

"తెలుసుకొన్నాను. హత్యాయుధం మీరు చెప్పిన కోటును, స్వాధీనం చేసుకోవడానికి సుజాత ఇంటికెళ్లాను. అక్కడి వాతావరణంలో నా ప్రవేశం కలకలం రేపింది. సుజాత వెంటనే ఆ కోటును స్వాధీనం చేసింది. ఆ తర్వాత గొడ్డలి కోసం గాలించేందుకు అన్నివిధాలా తోడ్పడింది—కాని గొడ్డలి ఇంట్లో ఎక్కడా లేదు! నేను సెలవు తీసుకుంటూ ఎలాటి కారణం చెప్పకుండా

అక్కా-చెల్లెలిరువురి ఫోటోలు తీసుకొన్నాను. ఆ రెండు ఫోటోల్లో మన ఫ్రెండ్ ఉషను చూసి—"

లాల్ టక్కున రిసీవర్ పెట్టేసి జాన్ వైపు తిరిగాడు: "బ్రదర్! రైలు పట్టాలు తప్పింది!"

"ఏం జరిగింది?"

"ఈ కేసులో మరో దారి చీలింది. రాత్రి లాంగ్ కోటులో దివాకర్ ఇంటికి ఉష వెళ్ళిందని ఫ్రెష్ న్యూస్...."

జాన్ తెల్ల మొఖం వేశాడు.

లాల్ ఫోనందుకుని సుజాతకు డయల్ చేశాడు.

"హలో, సుజాతా! ఈ రోజు మీ కన్నీ దుర్వార్తలే!"

"ఈసారి ఏమిటి లాల్?"

"ఏమీ లేదు, రాత్రి దివాకర్ ఇంటికెళ్ళింది మీ నాన్న అని నిశ్చయంగా చెప్పగలరా?"

"ఎందుకు? ఆయన వెళ్ళలేదా? అయితే...."

"రాత్రి కార్లో మీ రెవర్ని చూశారు!" తీవ్రంగా అడిగాడు లాల్.

"నేను—నేను—అయితే నేను చూసింది పొర పాటా?"

"పటప్! దేవుడు మేలుచేసి ఇప్పుడా అభిప్రాయా నికి రాకండి. పరిస్థితి మారటంతో మీ స్టేట్‌మెంట్ కూడా మార్చేయకండి! మీరు చూసింది చూసినట్లు అంతా నిజం చెప్తే మీ చెల్లెలికి చాలా మేలు చేసిన వారవుతారు!"

"ఓహ్ లాల్! ఉష యేం చేసింది!"

"రాత్రి ఆమె దివాకర్ ఇంటికెళ్ళిందని ఇప్పుడే సాక్ష్యం లభించింది. దానికి తిరుగు లేదు! ఆమె లాంగ్

కోటులో లేకపోతే మీరు గుర్తించేవారు. కానీ గొడ్డలిని దాచడానికామె దాన్ని తొడుక్కొని వెళ్ళింది. అది చూసి మీరు తండ్రి అని పొరబడ్డారు....మీ ఇంట్లో ఫోన్‌కి ఎక్స్‌టెన్షన్ ఉందా?"

"ఉంది—దేనికి?"

"దివాకర్ మీకు ఫోన్ చేసి బెదిరించినప్పుడు విషయాలన్నీ ఆమె ఎక్స్‌టెన్షన్‌లో విని వుండాలి."

"ఓహ్! నేను నమ్మను! ఉష! అది ఒట్టి పిచ్చిది! దానికి ఒకర్ని చంపే ధైర్యం తెగువ...."

లాల్ గట్టిగా కళ్ళు మూసుకొని, రిసీవర్ పెట్టేసి, పిడికిలి బిగించి టేబిల్ మీద కొట్టాడు. "భూటాన్ విస్కీ!"

జాన్ యంత్రంలా లేచివెళ్ళి విస్కీ బాటిల్, గ్లాసులతో తిరిగి వచ్చాడు.

లాల్‌కో గ్లాసు అందించి, విస్కీపోసి, "పార్ట్‌నర్! తండ్రిని విపరీతంగా ప్రేమించి—అతనే సర్వస్వమనుకున్న ఒక కుమార్తె తన శత్రువును హత్యచేసి, దాన్ని తండ్రి మీదకు నెడుతుందా?" అనడిగాడు.

"నో, నో పార్ట్‌నర్, నో!"

"అయితే తండ్రి తలగడక్రింద ఆ ఉత్తరాలెలా వచ్చాయి?"

లాల్ ఒక్క గుక్కలో గ్లాసు ఖాళీచేసి, "అవును.. ఎలా వచ్చాయి?" అని గొణిగాడు.

ఇంతలో రివ్వుమని స్వింగ్ డోర్ తెరుచుకోవడం, డిటెక్టివ్‌లు గ్లాసులు దాచెయ్యడం ఒకేసారి జరిగాయి.

కృష్ణన్ నవ్వాడు, "రైట్! భూటాన్ విస్కీతో కాన్ఫరెన్స్ జోరుగా సాగుతోందన్నమాట?"

"కృష్ణన్, పరాచికాలకి నేనిప్పుడు మూడ్‌లో లేను" లాల్ అన్నాడు.

జాన్ నాలిక కరుచుకొని, టేబిల్ మీది విస్కీ బాటిల్ ఛటుక్కున తీసి క్రింద పెట్టాడు.

"కమాన్ బాయ్!" కృష్ణన్ చెయ్యిపట్టి ద్వారంలో నిలబడ్డ దివాకర్‌ని లోనికి లాగాడు.

దివాకర్ డిటెక్టివ్‌లను అయోమయంగా చూసి, లోనికొచ్చి కూర్చున్నాడు. అతని ఎర్రబడ్డ కళ్ళు, పీక్కుపోయిన ముఖం, రేగిపోయిన జుత్తు, మాసిపోయిన దుస్తులు యివన్నీ అతను రాత్రంతా నిద్రపోలేదని సూచిస్తున్నాయి.

లాల్ అన్నాడు, "మిస్టర్ దివాకర్, పొట్టకోసం దుర్మార్గం చేసేటప్పుడు ఎదుటివ్యక్తి సామర్థ్యం అంచనా వెయ్యడం మరువకూడదు. మీ తెలివితక్కువతనం వల్లనే మీ డర్టీ బిజినెస్‌లో మీ పార్ట్‌నర్‌ని పోగొట్టుకున్నారు. రాత్రంతా మీ రెక్కడున్నారు?"

"లాడ్జింగ్‌లో...."

"ఏ లాడ్జింగ్‌లో?"

"భగవాన్ లాడ్జి—బేగం బజారులో వుంది. అక్కడ భూషణ్ ఒకగది తీసుకున్నాడు."

"మీ రక్కడ కెందుకెళ్ళారు?"

"మిస్టర్ లాల్, మీరు మారు ఉత్తరాలతో నన్ను మోసం చేశారు!"

లాల్ అతన్ని ఏవగింపుగా చూశాడు. "అవును, చేశాను. మీరేం చేశారు?"

"మీ రెళ్ళిపోయాక భూషణ్‌కు ఫోన్ చేశాను. అతనువచ్చి ఆ ఉత్తరాల్ని చదివి నన్ను తిట్టాడు! అవి అత

నిచ్చిన బూతులేఖలు కావట! ఆ మారువు త్తరాలతో మీరు నన్ను చవటనుచేసి అసలు ఉ త్తరాలతో వెళ్ళిపోయారు!"

"అప్పుడు భూషణ్ ఏం చేశాడు?"

"నన్ను ఇష్టంవచ్చినట్లు బూతులు తిట్టాడు! నాకు తెలుగురాక ఈ వ్యవహారంలో అన్ని విధాలా చెడ్డాను! అతను స్నేహితుడి కుటుంబాన్ని బ్లాక్ మెయిల్ చెయ్యడానికి నన్ను ఎన్నుకొని, తను చాటుగా ఉండిపోయాడు. బిజినెస్ సక్సెస్ చేస్తే అయిదువేలు ఇస్తానన్నాడు. అతను స్మగ్లింగ్ లో దిగడానికి ఏజెంటుకి యిరవై వేలు డిపాజిట్ కట్టవల్సి వచ్చింది. ఆ డబ్బుకోసం ఈ ఎత్తు వేశాడు.

"నా వల్ల వ్యవహారం చెడిపోవడంతో నాకిస్తానన్న కమీషన్ ఇవ్వనని చెప్పాడు—ఇక నా సహాయం అవసరం లేదన్నాడు. అతని జేబులో అసలు ఉ త్తరాలకి డూప్లికేట్ కాపీలున్నాయి. వాటి సహాయంతో మిమ్మల్ని పిల్చి స్వయంగా బిజినెస్ సెటిల్ చేసుకుంటానన్నాడు. నా మీద రూం తాళంచెవి విసరి వెంటనే వెళ్ళిపొమ్మన్నాడు. చేసేదిలేక నేనక్కడనుంచి వెళ్ళిపోయాను."

"ఎన్ని గంటలకి?"

"సుమారు పదకొండు గంటలకి. భూషణ్ చేత తిట్లు తిని, నా చేతగానితనం నిరూపించుకోవడంతో మనసు విరిగిపోయింది. మెహదీ పట్నంలో ఒక బార్ లో కూర్చుని చిత్తుగా తాగేశాను. తెలివితప్పాను. చివరికి అపస్మారక స్థితిలో నన్ను బార్ వాళ్ళు భూషణ్ గదికి తరలించారు. అప్పుడు సమయం రెండు దాటిందనుకొంటాను. గదిలో రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. తెల్లారాక ఇంటికి ఫోన్ చేశాను—"

"ఎన్ని గంటలకి?"

"పది—పదిగంటలకి!" దివాకర్ తడబడ్డాడు. "కానీ సమాధానంలేదు! అతను ఇంట్లో లేడనుకున్నాను. గదికే వస్తాడనుకున్నాను. కాని యెంతకూ రాకపోవడంతో నేనే యింటికెళ్ళాను. అక్కడ పోలీసులు-భూషణ్—"

"సరే, మీరు చేసే వృత్తి ఏమిటి?"

"నేనీమధ్యే బొంబాయి నుంచి వచ్చాను—ఏదైనా ఉద్యోగం చేద్దామని."

"ఏం ఉద్యోగం?"

"ఏదైనా ఉద్యోగం—చివరికి బూట్ పాలీషైనా, ఒళ్ళు మాలీషైనా సరే! ఇంతవరకూ ఏ అవకాశమూ లభించలేదు. ఇక్కడ బొంబాయికంటే మరీ అధ్వాన్నంగా వుంది!"

"మీ దగ్గర రివాల్వర్ యెక్కడిది?"

"అది—దాన్ని—అది నాదేగానీ అందులో గుళ్ళుండవు! ఖాళీగానే వుంచుకుంటాను. ఆత్మరక్షణకోసం బొంబాయిలో కొన్నాను. అక్కడ అరాచకం రోజు రోజుకీ ఎలా పెరిగిపోతుందో మీకు తెలుసు...."

"అయినా మీరు దాన్ని ఖాళీగానే వుంచుకుంటారన్న మాట?"

"అవును. దాన్ని చూసి నా దరికెవరూ రారు! అపార్థం చేసుకోకండి—దానికి పర్మిట్ కూడా వుంది."

"ఐ సీ! రాత్రి మీరు 11 ప్రాంతాల యింటినుంచి వెళ్ళారా?"

"అవును."

"ముందా, వెనకా?"

"పది నిమిషాల ముందు."

"భూషణ్ మీ ఇంటి కెప్పుడొచ్చాడు?"

"తొమ్మిది గంటలకు."

"అప్పుడు మీ రేం చేస్తున్నారు?"

"ఎందుకు? ఏమీ లేదు!"

"మీ రప్పుడు కిచ్చెన్‌లో ఆమ్లెట్స్ వేయడంలేదా?"

"ఏమిటీ!"

"ఆమ్లెట్స్. రెండు ఆమ్లెట్స్ వేసి ఒకటి తిన్నారు. ఇంతలో భూషణ్ వచ్చి మిమ్మల్ని తరిమివేయడంతో రెండో ఆమ్లెట్ పెనంమీదే వుండిపోయి మాడి పోయింది...."

"గాడ్! మీరు నన్ను చవటనుచేసి వెళ్ళిపోతే నేను ఆమ్లెట్స్ వేసుకొని తింటూ కూర్చుంటానా! భూషణ్ వచ్చేటప్పుడు అరడజను గుడ్లు తెచ్చాడు."

"ఎక్కడ?"

"వీధి చివర షాపులో. నన్ను వెళ్ళగొట్టి అతనే వేసుకొని తింటున్నాడనుకొంటాను — ఇంతలో హంతకుడు వచ్చి—"

లాల్ కృష్ణన్ వైపు తిరిగాడు, "ఇన్‌స్పెక్టర్ ఇతన్ని కస్టడీలో ఉంచండి!"

"దేనికీ?"

"బ్లాక్‌మెయిల్ గేమ్‌లో మీ చేతులు మురికి అయ్యాయి."

"మరి ఉష గురించేమిటి?" కృష్ణన్ అడిగాడు.

"ఆమె సెడేషన్‌లో ఉంది. అరెస్టు చెయ్యడానికి డాక్టర్ ఒప్పుకోడు. మీరు ముందు వీలైనంత త్వరగా మెడికల్ రిపోర్టు నా ముందు వుంచి—వేరే విషయాలు ఆలోచించండి!" అని లేచాడు లాల్.

9

సాయంత్రం ఏడు గంటలకు కృష్ణన్, డాక్టర్ రఘునాథంతో యేజెన్సీ ఆఫీసులో ప్రవేశించాడు.

"హల్లో గ్యాంగ్! ఎంతవరకొచ్చింది?"

జాన్ భుజాలెగరేసి అన్నాడు: "ధైర్యసాహసాలు బొత్తిగా లేని ఒక అమాయకురాలు దారుణంగా హత్యయెలా చేస్తుందా అని ఆలోచిస్తున్నాను. ఒకవేళ తెగించి కారెక్టర్ కోసం చేసినా, అదే కారెక్టర్‌ను దెబ్బతీసే ఉత్తరాల్ని నాశనం చెయ్యకుండా ప్రాణప్రదంగా ప్రేమించే తండ్రి దగ్గర ఎందుకు పెట్టిందో అర్థం గావడంలేదు."

కృష్ణన్ ముఖం మాడ్చుకొని, "ఆమె నడక్కపోయారా?" అన్నాడు.

డాక్టర్ బ్యాగులోంచి కొన్ని కాయితాలు తీసి టేబిల్ మీద పెట్టేడు.

లాల్ అడ్డంగా తలూపి, "చదివే ఓపిక లేదు. మీ రిపోర్టు ఏమిటే నోటితో చెప్పండి!" అన్నాడు.

డాక్టర్ అన్నాడు: "చావు నిన్న రాత్రి 1-2గంటల మధ్య సంభవించింది. తలమీద గొడ్డలి పోటు బలంగా పడింది. గాయం మూడంగుళాలు లోతు, నాలుగంగుళాల పొడవు, ఒక అంగుళం వెడల్పు వుంది. గాయాన్ని బట్టి హత్యాయుధం గొడ్డలి అని ధృవపడుతోంది. గాయం వెనుకనుంచి తగిలింది గనుక హతుడు ప్రమాదాన్ని ముందు పసిగట్టే సితిలో లేదు—అది నిశ్చయంగా దొంగచాటు దెబ్బ! కాబట్టి ఎలాంటి ప్రతిఘటన లేకుండా ప్రాణం వదిలాడు.

అయితే మెడదగ్గర ఉన్నిపోగులకు ఎక్స్‌ప్లనేషన్

మీరూహించే వుంటారు—శవం కదల్చబడింది. లాంగ్ కోటులోవున్న హంతకుడు లేదా హంతకురాలు శవం మీద సోదా జరుపుతున్నప్పుడు పోగులు అంటుకొని వుండాలి. అంతేగాని, ఆ ఇద్దరిమధ్య ఘర్షణ జరగలేదు. శవస్థితి శవం కదల్చబడిందని సూచిస్తోంది.

"అంతేగాక అందుకు హేతుబద్ధమైన ఆధారం కూడా వుంది—పోస్టుమార్టమ్ లివిడిటీ.

"చావు సంభవించాక దేహంలోని రక్తం ద్రవస్థితిని కోల్పోయేవరకూ గురుత్వాకర్షణవల్ల దేహం క్రింది భాగానికి చేరుకొని అక్కడ గడ్డ కడుతుంది. ఆయా దేహ భాగాలు నేలవల్లగానీ, మరే వస్తువువల్లగాని వత్తిడికి లోనయివుంటే అక్కడ చర్మంలో రక్తం గడ్డకట్టిన మచ్చలు కన్పిస్తాయి."

"వెరీవెల్! ఈ శవంమీద మీకలాంటి మచ్చలెక్కడ కన్పించాయి."

"భుజాలమీద—పిరుదలమీద—కాళ్ళ చీల మండల మీద—మోచేతులదగ్గర కన్పించాయి."

"కాబట్టి చావు సంభవించాక శవం చాలాసేపు వెల్లకిలా వుందన్న మాట?"

"అవును."

"ఆల్ రైట్, ఇక జీర్ణకోశంలో ఆహార స్థితి గురించి చెప్పండి."

"జీర్ణకోశంనిండా ఆహారం జీర్ణక్రియ ప్రాథమిక దశలోనే వుంది. అంటే చావుకు ముందు సుమారు గంట క్రితం తీసుకునుండాలి."

"ఎలాంటి ఆహారం?"

"అన్నం—పప్పు—బంగాళాదుంప — సాంబారు—

అప్పడం — పెరుగు. ఇవన్నీ ఏ శాఖాహార హోటల్‌లో నైనా ఆహారంలో కలుస్తాయి.”

లాల్ తలూపాడు, “అంతేనా? ఆహారంలో ఇంకేమీ కలిసి లేదా?”

“లేదు.”

“వెల్, హతుడు భోజనం తిన్నాక ఒక ఆమ్లెట్ తిన్నాడు.”

“అలాటిదేమీ లేదు.”

“నమ్మకంగా చెప్తున్నారా?”

“అవును. కడుపులో ఆమ్లెట్ లాటిదేమీ లేదు!”

“సరే,” లాల్ కృష్ణన్ వైపు తిరిగాడు. “మీరేం చెప్తారు?”

కృష్ణన్ అన్నాడు: “దివాకర్ స్టేట్‌మెంట్‌ని చెక్ చేశాను. అనుమానాల్లేవు. రాత్రి తొమ్మిది ప్రాంతాల భూషణ్ దివాకర్ ఇంటికొస్తూ వీధి చివర షాపులో అర డజను గుడ్లు తెచ్చుకున్నాడు. దివాకర్ రాత్రి సుమారు పదకొండున్నరకి మెహదీ పట్నంలో విక్రాంత్ బార్‌లో బాగా తాగి అల్లరి చేశాడు. అతను రెగ్యులర్ కస్టమర్ అవడంవల్ల బార్ వాళ్ళు బయటికి గెంటలేకపోయారు.

సుమారు రెండు గంటలకి కాస్త తెలివిలోకొచ్చాక, అడ్రసు తెలుసుకొని బేగం బజారులో భగవాన్ లాడ్జికి చేర్చారు. అక్కడ భూషణ్‌కో గది వుంది. ఆ రాత్రంతా అతను గది కదల్లేదని లాడ్జింగ్ వాళ్ళన్నారు. దట్సాల్! హత్యా సమయంలో దివాకర్ ఇంట్లో లేడని బలమైన ఎలిబీ వుంది. ఆ సమయంలో ఉష —”

“ఓ. కే. హత్యాయుధం ఇంకా దొరకలేదా?” జాన్ అడిగాడు.

"లేదు. దాని అదృశ్యం నా కర్థంగావడం లేదు. రాత్రి ఉష దివాకర్ ఇంటికి లాంగ్ కోటులో వచ్చింది గనుక అందులో గొడ్డలిని దాచి తెచ్చివుంటుంది. పని య్యాక దాన్ని తిరిగి ఇంటికి తీసికెళ్ళే అవసరం లేదు. దారిలో ఎక్కడేనా పారెయ్యొచ్చు."

"ఆ కోటును లాబ్‌కు పంపారా?" లాల్ అడిగాడు.

"పంపాను."

"రిజల్ట్ యేమిటి?"

"అనుకున్న రిజల్ట్ కాదు...." చిన్నగా గొణిగాడు కృష్ణన్.

"అంటే!"

"ఆ ఉన్నిపోగులు ఆ కోటువి కావు!"

"మరి!"

"ఆ కోటువి కావు! మరి దేనివో నాకు తెలియదు!"

"ఇన్‌స్పెక్టర్!" లాల్ అన్నాడు తీవ్రంగా, "ఆ పోగులు ఆ కోటువి కాకపోతే మరి దేనివి? శవంమీద ఎలా వచ్చాయి? హతుడు స్వెటర్ తొడుక్కున్నాడా?"

కృష్ణన్ నోరు మెదపలేదు.

డాక్టర్ ఆశ్చర్యంలోంచి తేరుకుని అన్నాడు: "ఇన్‌స్పెక్టర్, ఈ విషయం నాకెందుకు చెప్పలేదు? చాలా వింతగా వుంది! మిస్టర్ లాల్, స్వెటర్ తొలగించే అవసరం హంతకుడికేమిటి? అసలు స్వెటర్ తొడుక్కునే అవసరం హతుడికేమిటి? ఇది చలికాలం కాదు—ఎండలు మండిపోయి చెమటలుకక్కే స్తున్నాం!"

లాల్ ముఖం కర్కశంగా మారింది. తలతిప్పి జాన్‌ని చూశాడు. జాన్ కలవరంగా చూశాడు.

కొన్ని క్షణాలయ్యాక కృష్ణన్ లేచి వెళ్ళడానికి సిద్ధ

మయ్యాడు.

"గుడ్ లక్, లాల్! ఈ క్లిష్ట దశలో మీ కేదో మార్గం తడుతుందని ఆశిస్తాను. గుడ్ నైట్."

"గుడ్ నైట్."

కృష్ణన్ డాక్టర్‌తో వెళ్ళిపోయాక నిశ్శబ్దం ఆవరించు కుంది. లాల్ కిటికీదగ్గర నిలబడి రాకెట్ ఇంధనం వదిలి నట్లు సిగరెట్ పొగ వూదుతూ బయటికి చూడసాగాడు. పొగ రింగులు రింగులుగా బయట వెచ్చటి గాలిలోపై పైకి లేస్తూ తనతోబాటు లాల్ దృష్టిని కూడా తీసుకు పోతోంది.

లాల్ దృష్టి ఎదుటి బిల్డింగ్ ఆరో అంతస్తు నియాన్ లైటమీద పడి నిశ్చలంగా వుండిపోయింది. కొన్నిక్షణాల తర్వాత అతని కనుబొమలు ముడిపడ్డాయి. వెంటనే ముఖం విచ్చుకుంది. చిన్నగా ఈలవేసి వెనక్కు తిరిగాడు.

"ఏమిటి?" జాన్ అడిగాడు ఆత్రతగా.

"ఒక మార్గం తట్టింది...."

"ఎలా?"

"చెప్తాను—జాన్, ఆ కోటు సుజాత మార్చొయ్య లేదనుకొంటే, ఈ సమస్యకు ఒకే ఒక్క పరిష్కార ముంది," అన్నాడు లాల్.

10

"జెంటిల్ మెన్! ఇప్పుడీ కేసు పొగమంచులా విడిపో తోంది!" అన్నాడు లాల్, మర్నాడు ఉదయం యేజెన్సీ ఆఫీసులో కృష్ణన్, డాక్టర్ రఘునాథ్. దివా కర్ లను సమావేశపరచి.

లాల్ మాటలు విని కృష్ణన్ ఆసక్తిగా చూశాడు, "ఏం చేశారు?"

"వంద రూపాయలు ఖర్చు చేసి ఈ కేసులో అతి ముఖ్యమైన క్లూ కనుకున్నాను!"

"ఆ ఖర్చును సుజాత ఫీజుకి జోడిస్తాం," జాన్ ఏజెన్సీ పాలసీ వివరించాడు.

"ఓహ్! సమస్య సాధించారన్న మాట!" కృష్ణన్ అర్చాడు.

లాల్ తలూపాడు, "సాధించడానికి సమస్యలు లేక పోతే మేమెందుకు? నిన్న రాత్రి మిస్టర్ దివాకర్ ఇంటి కెవరెళ్ళారో మా అందరికీ తెలుసు!"

"ఎవరు?" దివాకర్ ఆత్రుతగా అడిగాడు.

లాల్ అతన్ని సూటిగా చూశాడు.

"ఓహ్ దివాకర్ మీ ఫ్రెండ్‌ని చంపిందెవరో తెలుసుకోవాలని—కాదు—పట్టుకోవాలని మీకు చాలా తొందరగా వుంది కదూ? మీ ఫ్రెండ్‌ని యెవరు చంపారో మీకు తెలుసా? పాపం, భూషణ్! ఈ పవిత్ర భారత భూమ్మీద స్మగ్లింగ్ బిజినెస్‌లో కాబోయే ఒక ధృవతార రాలిపోయింది! ప్చ్, రాలగొట్టిందెవరు? ఒక మామూలు బ్లాక్ మెయిల్ గేమ్‌లో తప్పటడుగు వేసి ఎలా బొల్చి తన్నేశాడు?"

దివాకర్ ముఖంలో రంగులు మారుతున్నాయి.

జాన్ తటాలున వంగి టేబిల్ క్రిందనుంచి గొడ్డలి తీసి మెరుపులా దివాకర్ తలమీదుగా విసిరాడు. దివాకర్ గావుకేక పెట్టి పైకెగిరాడు. జాన్ ఛటుక్కున మళ్ళీ వంగి టేబిల్ క్రిందనుంచి కంబళితీసి వల విసిరినట్టు దివాకర్ మీద కప్పేశాడు.

ఈ హఠాత్సంఘటనకి దివాకర్ అదిరిపోయి, వెనక్కి దూకి, ప్రాణం పోయేలా అర్చాడు.

"వద్దు! నన్ను చంపొద్దు! నేను నిజం చెప్పేస్తాను! భూషణ్‌ని నేనే చంపాను—ఆ గొడ్డలితోనే!"

కృష్ణన్ డాక్టర్‌లు కొయ్యబారిపోయి చూస్తున్నారు.

లాల్ నవ్వుతూ లేచి, దివాకర్ దగ్గరికెళ్ళి వీపు మీద ఛెళ్ళుమని చరిచాడు. "గుడ్! నువ్వు చాలా బుద్ధిమంతుడివి! ఇక నీ చేతులు జోడించి ఇన్‌స్పెక్టర్ కేసి జాపుతావా—నువ్వు చాలా తెలివైన హంతకుడివని లోకానికి తెలియడానికి?"

డాక్టర్ రఘునాథ్ డిటెక్టివ్‌లను వింతగా, అనుమానంగా, భయంగా, రకరకాలుగా చూశాడు.

"మిస్టర్ లాల్! నే నింకా ఆ షాక్‌నుంచి కోలుకోలేదు! నిజంగా అతన్ని చంపేశారనుకున్నాను! మైగాడ్! ఆ గొడ్డలి యెక్కడిది? ఆ కంబళి ఎక్కడిది?"

డిటెక్టివ్‌లు చిన్నగా నవ్వి వూరుకున్నారు.

"అసలు దివాకర్ మీద అనుమానం ఎలా వచ్చింది?" మళ్ళీ అడిగాడు డాక్టర్.

లాల్ ఒకక్షణం తర్వాత అన్నాడు:

"భూషణ్ ఆమ్లెట్ తిన్లేదని పోస్టుమార్టమ్‌లో తేలినప్పుడు అనుమానం వచ్చింది. గదిలో రెండు గ్రుడ్డు పెంకులున్నాయి. పెనంమీద ఒక ఆమ్లెట్ మాడిపోయి ఉంది. మరో ఆమ్లెట్ యెలా మాయమైంది? భూషణ్ తినలేదు. పిల్లి తిన్నదా? అలా జరిగివుంటే అది శవంచుట్టూ కేకలు వేస్తూ తిరిగినప్పుడు రక్తంలో, నూనెలో చాలా అడుగు జాడలు కన్పించేవి. నాకప్పుడే అనుమానం వచ్చింది—అది రెండుకాళ్ళ పిల్లి దివాకర్ అని.

"దివాకర్ ఆమ్లెట్ తినలేదని అబద్ధం చెప్పాడు.

దేనికి? పోస్టుమార్టం ప్రకారం హత్యాసమయంవల్ల అతని ఎలిబీ గాలికి కొట్టుకుపోతుంది గనుక! భూషణ్ చావుకి ముందు—అంటే—ఒంటిగంట ప్రాంతాల ఆమ్లెట్స్ వేస్తున్నాడని ఎవరైనా హత్యాస్థలం చూసి చెప్తారు. కాని అది పొరపాటు. ఆ సమయానికి అతను చచ్చి రెండు గంటలయింది!"

"ఏమిటీ! అతను చచ్చి...."

"మీరు పోస్టుమార్టమ్‌లో హత్యాసమయం గురించి వెలిబుచ్చిన అభిప్రాయం పూర్తిగా పొరపాటు. హత్య సుమారు పదకొండు గంటలకు జరిగింది. మీరు తప్పుడు నిర్ణయం చేయడానికి దివాకర్ శవంతో తమాషా చేశాడు."

"ఏం చేశాడు?"

"మొదటినుంచీ అంతా వివరంగా చెప్తాను," అన్నాడు లాల్ సిగరెట్ వెలిగించి "దివాకర్ ఇక్కడికి ఉద్యోగం కోసం రాలేదు. అతను స్మగ్లరకి ఏజెంట్. లేకపోతే ఒక సామాన్య పౌరునిదగ్గర ఆత్మరక్షణ కోసం రివాల్వర్ వుండే అవకాశం లేదు. ఇది అమెరికా కాదు—ఇక్కడి సమాజం స్థితిగతులు వేరు.

"భూషణ్ స్మగ్లింగ్‌లో దిగడానికి దివాకర్‌కు 20 వేలు డిపాజిట్ కట్టే అవసరం ఏర్పడింది. ఆ డబ్బుకోసం అతను సుజాత తండ్రిని అప్పు అడిగాడు. అక్కడ చుక్కెదురైంది. దానితో మార్గం తోచలేదు.

"అందువల్ల బాగా ఆలోచించి, ఓ పథకంవేసి సుజాతను బ్లాక్ మెయిల్ చేశాడు. ఆ బ్లాక్ మెయిల్‌లో తాను అజ్ఞాతంగా ఉండాలి గనుక దివాకర్ సహాయం తీసుకున్నాడు. అయితే అనతల సుజాత మా సహాయం

తీసుకోవడంతో వ్యవహారం బెడిసికొట్టింది. మేం దివాకర్‌ని ట్రిక్ చేసి అసలు ఉత్తరాల్ని చేజిక్కించుకున్నాం.

"అప్పుడు భూషణ్ రెచ్చిపోయి దివాకర్‌ని చివాట్లు పెట్టాడు. ఇక ఆ ఉత్తరాలకి డూప్లికేట్ కాపీలు తియ్యక తప్పదుగనుక, అలా చేయడంవల్ల మా విశ్వాసాన్ని వమ్ముచెయ్యడం జరిగింది గనుక, రాబోయే క్లిష్ట పరిస్థితిని తనే స్వయంగా చక్కబెట్టుకోవాలనుకొని దివాకర్‌ని కిక్ యిచ్చాడు. కమీషన్ ఇవ్వనని కచ్చితంగా చెప్పేసాడు.

లాల్ కాస్సేపాగి మళ్ళీ అన్నాడు, "అందుకు ప్రతి చర్యగా దివాకర్ భూషణ్ వ్యవహారం పోలీసులకు హెచ్చరించవచ్చుగానీ—భూషణ్ అంతకంటే పెద్ద నేరస్థునిగా తనని పట్టివ్వగలడు. కాబట్టి ఆ ఆలోచన విరమించుకున్నాడు. అయితే అతను హత్య చెయ్యడానికి దారితీసిన పరిస్థితి ఏమిటో నా కొకటి తోస్తోంది—"

"ఏమిటది?" డాక్టర్ అడిగాడు.

"డిపాజిట్ కట్టేందుకు దివాకర్ లాటి చవటని నమ్మకూడదనుకొని భూషణ్ తాను నేరుగా అతని బాస్‌తోనే సంప్రదిస్తానని చెప్పి వుండవచ్చు. అప్పుడు దివాకర్ భయపడ్డాడు. బాస్‌కి తన అసమర్థత భూషణ్ వివరిస్తే శిక్ష తప్పదు! వెలివేయవచ్చు లేదా ప్రాణం తీయవచ్చు. ఆ ప్రమాదం తప్పించడానికి దివాకర్ ఈ హత్యకు పూనుకొన్నాడు."

"దటీజ్ రైట్. అయితే ఈ హత్య ఎలా చేశాడు?"

"చాలా సింపుల్!" లాల్ అన్నాడు, లేచి పచార్లు

చేస్తూ. "ఈ హత్యమీద దివాకర్ బ్లాక్ మెయిల్ ముసుగు కప్పాలనుకున్నాడు. కాబట్టి సుజాత తండ్రిని హంతకుడు చెయ్యాలనుకున్నాడు. భూషణ్‌తో వాదన జరిగాక అతను సుజాత ఇంటికెళ్ళి ఏదైనా హత్యాయుధం కోసం వెతికాడు. అప్పుడు పెరట్లో గొడ్డలి దొరికింది. దానితో తిరిగివచ్చి కిచెన్‌లోకెళ్ళాడు.

గొడ్డలిని దాచి, ఆమ్లెట్స్ వేస్తున్న భూషణ్ దగ్గరికెళ్ళి మాటలు కలిపాడు. అప్పుడు సమయం సుమారు 11 గంటలవుతోంది. భూషణ్ మాటలు వింటూ మొదటి ఆమ్లెట్ వేస్తున్నాడు. క్రమంగా అతన్ని తిరిగి మచ్చిక చేసుకొని దివాకర్ ఆ ఆమ్లెట్ తిన్నాడు. భూషణ్ మరో ఆమ్లెట్ వేశాడు. ఈ లోపు దివాకర్ ఆమ్లెట్ తినేసి వెంటనే రంగంలోకి దిగాడు.

"బయటనుంచి గొడ్డలి తెచ్చి భూషణ్ తలమీద ఓ దెబ్బ వేశాడు. అంతే, భూషణ్ తలపట్టుకొని వెనక్కి కూలాడు. అతని చెయ్యితగిలి నూనెడబ్బా పడిపోయింది. క్షణాల్లో రక్తం మడుగుకట్టింది. దివాకర్ బ్లీడింగ్ పూర్తయేవరకూ ఆగి, శవాన్ని ఒక కంబళిలోకి చేర్చాడు. తర్వాత శవానికి బిగుతుగా కంబళి కప్పాడు—"

"ఓహ్—దేనికి?"

"ఎలిబీ కాపాడుకోవడానికి. అ తర్వాత అతను శవం జేబులోంచి రూం తాళాలు, డూప్లికేట్ ఉత్తరాలు తీసుకొని, ఇంటికి తాళంవేసి సుజాత ఇంటికి చేరుకున్నాడు. అక్కడ గొడ్డలి పారేసి, సుజాత తండ్రి తలగడ క్రింద ఆ ఉత్తరాల్ని పెట్టేసి, అప్పుడు బార్ కెళ్ళాడు. అక్కడనుంచి లాడ్జింగ్ కెళ్ళి, తెల్లారుతోండగా ఇంటికి తిరిగివచ్చి, శవంమీద కంబళి తీసేసి,

శవాన్ని తిరిగి కిచెన్‌లో పడేసి—ఈ సారి ఇంటికి తాళం వేయకుండా వెళ్ళిపోయాడు. తర్వాత మధ్యాహ్నం అమాయకంగా తిరిగివచ్చి బూటకపు కథ విన్పించాడు!"

"కంబళి కప్పటంలో అతని ఉద్దేశమేమిటి? మీ కను మానమెలా వచ్చింది?"

లాల్ వివరించాడు: "ఉష రాత్రి దివాకర్ యింటి కెళ్ళింది. ఈ బ్లాక్ మెయిల్ గురించి ఆమెకు తెలుసు. దివాకర్‌ని బ్రతిమిలాడి ఆ ఉత్తరాల్ని తెచ్చుకోవాలను కుంది. కానీ అతనింటికి తాళం వేసివుంది. ఆమె తిరిగి వచ్చేసింది. లాంగ్ కోటుతో వున్న ఆమెని చూసి సుజాత తండ్రి అనుకుంది. దురదృష్టవశాత్తూ పరిస్థితిని క్లిష్టం చేస్తూ అదే రాత్రి అతను గుండె ఆగి మరణించాడు.

అతని తలగడ క్రింద ఆ ఉత్తరాలు, సుజాత మాటలు విన్నాక అతనే హంతకుడనుకున్నాం. కానీ ఉష ప్రవేశంతో అది వమ్ము అయింది. ఆ తర్వాత శవంమీద ఉన్ని పోగులు ఉషను కూడా ఈ వ్యవహారం నుంచి తప్పించాయి. ఆ పోగులు ఉష తొడుక్కున్న కోటువి కావు. అలాంటి కోటు ఆమె తండ్రికి ఒక్కడికే ఉంది. సుజాత దాన్ని తారుమారు చేయలేదు. హతుడు స్వెట్టర్ తొడుక్కోలేదు.

"మరి ఆ పోగులు దేనివి?"

"మొదట నా కంతుబట్టలేదు! కాని దివాకర్ ఆమ్లెట్ గురించి అబద్ధం చెప్పాడని తెలిశాక నాకో అనుమానం వచ్చింది....అతను ఎలిబీకోసం తప్పకుండా శవంమీద ఏదో ప్రయోగం జరిపి వుంటాడనుకున్నాను. అలాంటి ప్రయోగం హత్యా సమయం గురించే అయివుండాలనుకున్నాను. వెంటనే నాకు మర్మం తెలిసిపోయింది!"

"ఏమిటది?"

లాల్ నిట్టూర్చాడు.

"తెలివైన హంతకుడు కంబళినుపయోగించి హత్యా సమయాన్నెలా మార్చాడో వివరిస్తాను: మరణం సంభవించాక శరీరోష్ణోగ్రత ముప్పావుగంట వరకు స్థిరంగా వుంటుంది. తరువాత 3 నుంచి 5 గంటలవరకు నెమ్మదిగా తగ్గుతుంది. ఆ తర్వాత త్వరితంగా తగ్గిపోతుంది. చివరికి దేహ ఉష్ణోగ్రత వాతావరణ ఉష్ణోగ్రతకు పడిపోయినపుడు ఈ తగ్గుదల వేగం క్షీణిస్తుంది. ఈ తగ్గుదల రేటు గంటకు 0.4C° డిగ్రీల చొప్పున వికిరణ పద్ధతిలో జరుగుతుంది.

"అయితే దేహంమీద బిగువైన దుస్తులుంటే ఉష్ణనష్టం ప్రారంభమయ్యే సమయం ముప్పావుగంటగాక మరికొంత ఆలస్యంగా వుంటుంది. అదే కంబళిలాటి ఉన్ని వస్త్రాలు చుట్టివుంటే ఈ భేదం కొన్ని గంటలకు చేరుకొంటుంది.

"అయితే దేహం వేడిని కోల్పోకుండా కంబళి కొన్ని గంటలవరకు ఉష్ణ వికిరణాన్ని నిరోధిస్తుందన్న మాట-

"కాబట్టి ఇక్కడ హంతకుడు శవాన్ని కొన్ని గంటలపాటు కంబళిలో చుట్టిపెట్టటం వలన ఉష్ణోగ్రత తగ్గుదల వెంటనే ప్రారంభం కాలేదు. రెండు గంటలు ఆలస్యంగా, సుమారు ఒంటిగంటకు ప్రారంభమైంది. అందువల్లనే మీరు హత్యాసమయాన్ని 1—2 గంటల మధ్య నిర్ణయించారు. ఆ సమయంలో దివాకర్ ఘటిష్టమైన ఎలిబీ సృష్టించుకొన్నాడు.

డాక్టర్ ముఖం ఉద్రేకంతో ఎర్రబడింది.

లాల్ మళ్ళీ అన్నాడు: "దివాకర్ ఆమ్లెట్ తిన్నా

నని చెప్తే అతని ఎలిబీ ముక్కలయ్యేది. ఎందుకంటే— పదకొండు గంటలకి అతను ఆమ్లెట్ తిని బయలుదేరితే, పోస్టుమార్టమ్‌లో తారుమారయ్యే హత్యాసమయం ఒంటి గంటవరకూ భూషణ్ యింకా రెండవ ఆమ్లెట్ వేస్తూనే వున్నాడా అన్నది అతన్ని పట్టిస్తుంది. కాబట్టి తిన్లేదని చెప్పాడు. దట్సాల్ డాక్టర్. ఈ హత్యలో మర్మం తెలిశాక మేం రాత్రి దివాకర్ యింటిని సోదా చేశాం. అక్కడ బీరువాలో రక్తం మరకలున్న ఒక కంబళి దొరికింది. వెంటనే హత్యాయుధం కోసం సుజాత ఇంటిని రహస్యంగా గాలించాము. నేను వారించినా వినకుండా జాన్ బావిలో దిగి గొడ్డలి తీశాడు.”

“ఓహ్! అయితే దాన్ని దివాకర్ మీదకు ఎందుకు విసిరారు?”

జాన్‌ని చూసి లాల్ నవ్వి అన్నాడు: “నేరం చేసిన వాళ్ళ అంతరంగంలో ఎన్నో భయాలూ బలహీనతలూ వుంటాయి. అవి ఏ క్షణంలో తమకు తెలియకుండా బయట పడతాయోనన్న స్పృహ వాళ్ళకుండదు. జాన్ గొడ్డలి విసిరి కంబళి కప్పటంతో, దివాకర్ గావుకేక పెట్టి నిజం కక్కేశాడు—బావుంది కదూ?”

ఫోన్ మ్రోగింది.

లాల్ రిసీవరందుకున్నాడు. అవతల సుజాత పలికింది.

“మిస్టర్ లాల్! కంగ్రాచ్యులేషన్స్! మీరు హంతకుడ్ని పట్టుకున్నారని విన్నాను.... థాంక్ గాడ్! నా తండ్రి గురించి లోకం చెడుగా అనుకునే ప్రమాదం తప్పించారు! అంతేగాక ఈ హత్యనుంచి నా చెల్లెల్ని కూడా రక్షించారు! ఆమె కోలుకున్నాక మీ గురించి చెప్పి—”

"ఈ హత్య గురించి ఆమెకు తెలియనివ్వకండి!" లాల్ వారించాడు.

"ఆమెకు తండ్రి లేనిలోటు మా గురించి గొప్పలు చెప్పటంవల్ల భర్తీగాదు! ఆమెకు పూర్తి మానసిక విశ్రాంతి కావాలి-మీ రామెను కంటికి రెప్పలా కాపాడు కోవాలి."

లాల్ రిసీవర్ పెట్టేసి, డాక్టర్ వైపు తిరిగి, "ఇంకే మిటి?" అన్నాడు అలసటగా.

డాక్టర్ కళ్ళు కృతజ్ఞతాభావంతో మెరుస్తున్నాయి.

—:ఐపోయింది:—